నిద్రాళువు

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

పొద్దు వాటారింది.

గాలి సాగి సాగి ఒక్కమారు స్తంభించిపోయి నట్టుగా మధ్య గదిలో నుంచి వినవచ్చే సందడి ఉన్నట్టుండి ఆగిపోయింది. పార్వతమ్మ గుమ్మంలోకి వచ్చి చూసింది. అంతకు కొద్దిసెకన్ల ముందు వరకూ కూచుని చర్చలు, ఉపన్యాసాలు, తీర్మానాలు, తర్జనభర్జనలతో గడిపిన స్త్రీలంతా ఒక్కరొక్కరే ఇంటిముఖం పట్టారు. నారాయణి ప్రతివక్కరి నుదుటా కుంకుమ బొట్టు పెడుతూ మర్నాడు ఇంకా ముందుగానే రమ్మని మరీ మరీ చెప్పి వీడ్కోలు ఇస్తూంది.

చలిగాలి వుండీ వుడిగీ ఒక విసురు విసురుతోంది. ఇళ్ళ కప్పులమీద తెల్లటిపొగ సుళ్ళు తిరుగుతూ గాలి వాలున పడి సాగిపోతోంది.

నారాయణి సన్నగా కూనిరాగం తీస్తూ గదిలోకి వచ్చి "ఏం పిన్నమ్మా! ఒక్కతివి వంటరిగా కూచుని ఏవిఁ చేస్తున్నటు?" అంది.

పార్వతమ్మ కళ్ళజోడు చివరి నుంచి నారాయణి ముఖంలోకి చూస్తూ "ఏవీఁ లేదమ్మా పుస్తకం చదువుకుంటున్నాను" అంది.

"అంతేనా, లేకుంటే మీ వాళ్ళెవరిమీదకైనా ధ్యాసమళ్లిందా?"

"అలాంటిదేమీ వుండదమ్మాయ్. నీకు విసుగెత్తి నువ్వు పొమ్మనాలిగాని అంతరకూ ఈ చూరు పట్టుకుని వేలాడుతూనే వుంటాను."

నారాయణి వ్యంగ్యంగా నవ్వుతూ "నిన్ను బాగా అర్థం చేసుకున్న మనిషిని కాబట్టి ఇప్పుడు నువ్వన్నమాటని సరదాగా, తేలిగ్గా తీసుకుంటాను. కాని ఒక విషయంమటుకు గుర్తుపెట్టుకోవటం మంచిది. ఆదరించటంలో, అభిమానించటంలోనూ ఈ నారాయణమ్మ ఎవరికీ తీసిపోయేదికాదు. జీవితంలో నిగ్రహం, మట్టు మర్యాదా, సభ్యతా, అభిమానం విడిచిపెట్టే సిగ్గుమాలిన మనిషి నారాయణి కాదు. నారాయణి బరితెగించినఆడది కాదు. భర్త అదుపాజ్ఞల్లో ఒద్దికగా మసులుకొనే నిగ్రహంగల ఆడది.

ఈ చివరి మాటలు ఏ ఉద్దేశంతో ఎవరికి నిర్దేశించబడ్డవో పార్వతమ్మ గ్రహించకపోలేదు. అప్రస్తుతంగా, ఆమె ఈ ధోరణి ప్రదర్శించటం పార్వతమ్మ మనసుకి కొంత నొప్పి కలగకపోలేదు. ఇలాంటి మాటలు వినటం పడటం ఇవాళేమీ కొత్తకూడా కాదు.

ఈ నిందా గర్భితమైన ప్రస్తావన ఒక స్త్రీ నోటి నుండి వినటంవల్ల ఆమె మనసులో కోపానికి బదులు కొంత జాలి, బాధ ఆక్రమించాయి. ఆమె ఒక్కమారు బరువుగా నిట్టూర్చి తిరిగి తన దృష్టి పుస్తకంమీదకు మళ్ళించి ఇంతవరకూ చదివిన ఆఖరి పేజీ కోసం వెతుక్కోసాగింది. కాని అప్పటికే చీకటి బాగా అలుముకు పోవటంవల్ల ఆమె ఇక చదవలేక పుస్తకం మూసి దాన్ని భద్రంగా టేబిల్ మీద వుంచి మధ్య గదిలోకి వచ్చింది.

నారాయణి దీపం వెలిగించి గది మధ్యన కొంకికి వేలాడదీస్తూంది.

"అమ్మాయ్! పెద్దదాన్ని నే నుండగా నీ కెందుకీ అనవసరపు శ్రమ చెప్పు. ఈ పూటనుంచి నేను వండి పడేస్తాను. నా మాట విను." అంది పార్వతమ్మ.

"ఒద్దులే. నే నే వండుతాను."

"నువ్వలాగంటే నే నేం చెప్పేది. పెద్దదాన్ని నేనుండగా నీ కెందుకీ బాధ"

"ఇందులో బాధకేముందమ్మా. ఎవరు వండితేనేం?" అంది నారాయణి.

"నా మనసెంత బాధపడుతుందో నీ కర్థం కావటంలేదు."

"నువ్వు చుట్టానివమ్మా. చుట్టాలు చుట్టాలుగానే మన్నించబడాలి" అంది నారాయణి.

పార్వతమ్మ ముఖంమీద నీలిఛాయలు ఆవరించాయి. ఆమె ముఖం ముడుచుకుపోయింది. తను ఏ పరిస్థితుల్లో ఈ ఇంటిగడప తొక్కిందో, ఈ నారాయణమ్మకి తెలియకపోదు. ఆమె నోట మరి మాట పెగల్లేదు. తను వచ్చి కొద్దిరోజులైనా తనవునికి ఇతరులకి బాధావహమైపోయింది అప్పుడే. తనకి మనశ్శాంతితోపాటు భుక్తికూడా అవసరం. అవి లభ్యమయే స్థానంకోసం ఆమెపడిన ప్రయాసలోనే లోకంచేత వేలుపెట్టి చూపించుకునే దురవస్థకి గురికావల్సివచ్చింది. ఇప్పుడు నారాయణి అన్నమాటల వెనుక నిగూఢమైయున్న భావం పార్వతమ్మకి ఒక హెచ్చరికవంటిదనే చెప్పాలి. నారాయణికి భర్త ఆర్జనదృష్ట్యా అయితే భర్త జీవించివున్నంతకాలం వైభవంగాగడిపి భర్తతదనంతరం వీథినిపడ్డ ఒకదిక్కుమాలిన ఆడదాన్ని కొంతకాలం పోషించగలగటం అన్నది పెద్దలెఖ్ఖలోకి రావల్సిన అవసరం లేదు.

"నిరాశ్రయులకి ఈ విశాలప్రపంచంలో ఏమూలనోకాస్త నిలబడే ఆస్కారం లేకపోతుందా అనే ఆశని పెంచుకోవటం తెలివితక్కువ"అని మనసులోనే అనుకున్నదై పార్వతమ్మ వీథివసారాలోకినడిచి మెట్లమీద స్తంభానికి చారబడి కూచుండిపోయింది.

వీథిగేటు తెరుచుకుని అనూరాధ చంద్రుణ్ని వెంటబెట్టుకుని లోపలికివచ్చింది. వస్తూనే "ఏం అమ్మమ్మా! అలా కూచున్నావు మాటామంతీ లేకుండా?" అంది అనూరాధ.

పార్వతమ్మ ఆలోచనల్లోనుంచి తెప్పరిల్లి కంగారు కప్పిపుచ్చుకుంటూ "వచ్చావా అమ్మాయ్! రా! ఇలా వచ్చికూర్చో" అంటూ ఆప్యాయంగా పలకరించింది.

అనూరాధ పార్వతమ్మపక్కగా కూర్చుని తన స్నేహితురాలి అనుభవాలగురించి చెప్పసాగింది.

లోపల నారాయణి వంటప్రయత్నంలో మునిగిపోయింది. మధ్యమధ్య కొడుకుని మందలిస్తూంది. పార్వతమ్మ ఏదో తెలియని అభిమానంతో, సిగ్గుపడుతూ వుండీ వుడిగీ వంటగదివైపు చూస్తూ మనవరాలిమాటలు వింటూ వూఁ! కొడుతూంది.

"నువ్వు నే చెప్పేది వింటున్నావా అమ్మమ్మా"

"ఎందుకు వినటం లేదు. అవును, ఆ సరోజని చూట్టానికి పెళ్ళికొడుకువచ్చాడు. వచ్చింతర్వాత ఏమయింది. చెప్పు"

అనూరాధ పెద్దగానవ్వేసి "నువ్వసలు వినటం లేదు. నేను ఆతర్వాత చాలా చెప్పాను. నువ్వింకా మొదట్లో నేవున్నావు" అంది.

"అవునుగాని నేనొకటడుగుతాను చెబుతావా అమ్మా" అంది పార్వతమ్మ మెల్లగా.

"ఏమిఁటది?"

"మీ అమ్మకంటె నేను పెద్దదాన్నికదా. నేనిలా కూచుని చిన్నవాళ్ళచేత చేయించుకుంటే చూసేవాళ్ళేమనుకుంటారు. అదేమైనా బాగుంటుందా?"

"పోనీ నువ్వే వంటచెయ్యకపోయావా?"

"అలాగని నేనంటే మీఅమ్మ వల్లకాదంటుంది."

"పోనీలెద్దూ హాయిగా కబుర్లుచెప్పు లేకపోతే కథలుచెప్పు"—ఈపదహారేళ్ళ అనూరాధ అమాయికత్వానికి పార్వతమ్మ కరిగిపోతూ "నీకు బంగారంలాంటి జతగాడు దొరుకుతాడమ్మా" అంది.

అనూరాధ సిగ్గుతో జేవురించిన ముఖాన్ని పక్కగాతిప్పుకుని "నువ్వు చిక్కనిమాటలు ప్రయోగిస్తావు అమ్మమ్మా, చాలామంది మొగుడు, భర్త అంటూ చాలా మోటుగా మాట్లాడతారు" అంది.

పార్వతమ్మ "అవునమ్మా వాటిఉచ్చారణలో వినవచ్చేధ్వని చాలాకర్కశంగా వుంటుంది. ఈపదాల్లో లాలిత్యంలేదు. కాని ఆలాలిత్యం చాలాఅవసరం" అంది ఆమె.

కొద్దిసేపు పోయింతర్వాత పార్వతమ్మ ఏదో జ్ఞప్తికి వచ్చినటుగా "అన్నట్టు అడగటం మరిచాను. ఇంతకీ సరోజినికి ఆ సంబంధం కుదిరిందా లేదా?" అంది.

ఇంకా ఏమీఁ తెలియలేదు. ఆ అబ్బాయ్ ఏమీఁ బాగుండడనీ వయస్సులోకూడా "వార ఎక్కువగా వుందనీ విన్నాను" అంది అనూరాధ.

"సరోజినీ వాళ్ళు బాగావున్నవారు కారేమిఁటి?"

"పెద్ద స్థితిమంతులు కారు. మనలాంటివాళ్ళే."

"ఆ అమ్మాయికి వరుడు నచ్చాడటనా?"

"అదే నే నడిగాను. దానిదంతా వేదాంతం. 'నాకు నచ్చుట మేమిఁటి? వాళ్ళకి నేను నచ్చాలి. అంతే. అతను నాకు నచ్చుటమనే ప్రసక్తిలేదు. అసలది ఒక సమస్య కానేకాదు' అంది సరోజిని. ఇదెక్కడైనా

వుంటా అమ్మమ్మా. ఎంత మగవాడయితేమటుకు, ఆడ దానికి మటుకు కోరిక లుండవా ఏమిటి?"

"చూడవచ్చిన ప్రతి మగవాణ్ణీ ఆడపిల్ల తన అభిప్రాయాల దృష్ట్యా ఎన్నుకోవటం అన్నది సాగేది కాదు. సరోజని విషయంలోనూ అంతే అయింది. ఇక ఆమెకి మొగవాడంటూ ఒకడు తన మెళ్లో పుస్తెకడితే చాలు, అనే స్థితికి వచ్చేసింది. విసుగెత్తిపోయింది పాపం" అంది పార్వతమ్మ.

ఏదైనా అనుభవంలోకి వచ్చేవరకూ దాని స్వరూప స్వభావాలు ఊహించగలగటం అన్నది అందరికీ సాధ్యమయేదికాదు. అనూరాధకూడా ఆ అందరిలోను ఒకత్తె. ఈ పెళ్ళి చూపుల తతంగాలు, బేరసారాలు, నిరసనలు నిరుత్సాహాలు-ఇవన్నీ ఇంకా ఆమెకు అనుభవానికి రాలేదు. ఆమె ఆలోచనలు అడివిలో మావిడిచెట్టును అల్లుకుని స్వేచ్ఛగా విస్తరించుకునే మల్లెతీగకు మల్లే సున్నితంగా సాగిపోతూంటాయి. ఏదో ఒక అందమైన వూహాచిత్రాన్ని నిర్మించుకో గలగటంవరకే ఆమెకు చేతనయింది. ఆ రూపాన్ని, లక్షణాలని స్మరించుకొని తియ్యగా బాధపడగలదు. అంతేగాని ఆ అందమైన కలలు విరిగిన అలలుగా నేల కూలినప్పుడు పొందే భంగపాటును నిభాయించుకోగలగటం అన్నది ఎంత అవసరమో, అటువంటి అవస్థ సంప్రాప్తించటం ఎంత సత్యమో ఆమె వూహించలేదు. అందుకనే సరోజిని అన్నమాటలు ఆమెకు విచిత్రంగా తోచాయి. ఆ మాటల వెనక ధ్వనించే నిస్పృహ ఆమెకి అవగాహన కాలేదు.

అనూరాధని దగ్గరగా హత్తుకుంటూ ఆకాశంలో తెల్లటి మేఘాలచాటునపడ్డ చందమామను చూపిస్తూ "ఈ చందమామ, అలా పరుసలు తీసే మబ్బులు ఒకప్పుడు నన్ను కవ్వించి కవ్వించి ఏడిపించాయి. అయినా నాకు కనువిప్పు కలగలేదు. జాగృతి నాకు లేకపోయింది. నాకు ముత్తువదిలి కనువిప్పు కలిగే సమయానికి అంతా మీరిపోయిందని తెలుసుకున్నాను. అప్పుడు నా వునికి నాకు అర్థం అయింది."

"నువ్వు వుండి వుండి పిచ్చిగా మాట్లాడుతూంటావు అమ్మమ్మా! నాకేమీ అర్థంకాదు. ఇంతకీ అదేమిటో పూర్తిగా వివరంగా చెప్పరాదూ" అంది అనూరాధ. కాని ఆ కంఠంలోని బిరుసుతనం లిప్తలో మారిపోయింది.

"అదేమిటి అమ్మమ్మా ఎందుకిలా కన్నీరు పెట్టుకుంటావు" అంది అనునయపూర్వకమైన ధోరణిలో.

"ఏవే అమ్మాయ్! అన్నానికి లేవండి" అంటూ లోపల్నించి నారాయణి గొంతు వినడంతో పార్వతమ్మ కంగారుగా కళ్లు తుడుచుకుని "పో అమ్మా! అమ్మ పిలుస్తూంది" అంది.

అనూరాధ లోపలికి వెళ్ళింది. పార్వతమ్మ గాఢమైన నిట్టూర్పు విడిచి అనూరాధని అనుసరించింది.

2

నారాయణి లోకందృష్టిలో అంత ఆశ్చర్యపడవలసిన మనిషి కాదు. కాని ఆమెను చూసి పార్వతమ్మ ప్రతిక్షణం దిగులు పడుతూనే వుంటుంది. భయపడుతూనే వుంటుంది. అందుకనే తన విషయంలో నారాయణి కొన్ని కొన్ని సందర్భాల్లో కర్కశమైన విధానం అవలంబించినా పార్వతమ్మ దాన్నంత తీవ్రంగా తీసుకోదు. సర్దుకుపోతుంది. చిన్నతనంనుంచీ పెద్దవాళ్ళ చాటున కట్టుబాట్లలో పెరిగిన నారాయణి ఇప్పటికీ ఆ లక్షణాలు, గుణాలు పీసమైనా వదులుకోకుండా తనలో జీర్ణం చేసుకుని మసులుతూంటుంది. ఆమెకీ ప్రపంచంలో భర్త చరణాలు తప్ప మరేమీ అవసరం లేదు. ఆమె హృదయాన్ని అంతగా దోచుకోగలిగిన శక్తిగల వస్తువేదీ మరొకటి ఈ ప్రపంచంలో లేదు. కన్నకూతురైనా, కొడుకైనా, మరింకెవరైనా వాటి తర్వాతనే. అందుకనే ఆమె తల్లి పుట్టెడు జబ్బులో వుండి సహాయానికి రమ్మనమని కబురు చేసినపుడు నారాయణి నిర్మొహమాటంగా వీలులేదని జవాబు పంపించింది. భర్తకి ఎక్కడ ఇబ్బందికలుగుతుందో అని ఆమె ఆలోచించింది. తండ్రిపోయిన కొత్తలో విధవ తల్లి తోడుగా నాలుగురోజులుండమని ఆమె ప్రాధేయపడితే "నేను ఒంటరిదాన్నా అమ్మా, వారిని ఎవరు చూస్తారుచెప్పు- అని సమాధానం చెప్పింది. ఆమె ఈ ముప్పయి అయిదు సంవత్సరాలలోనూ ఎన్నడూ గుమ్మం వదిలి ఎక్కడా నాలుగురోజులున్నపాపాన పోలేదు. తల్లి మనసు కష్టపెట్టుకుంటే ఆమె చెప్పిన సమాధానం ఇది- వారు అందరివంటి మనిషి కారమ్మా నేను ఒక్కక్షణం లేకపోతే వారికా ఇంట్లో అంతా అయోమయం అయిపోతుంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకూ ఆయనకు సంబంధించిన ప్రతి చిన్నపని నేను చూసుకోవాలి. నిజంగా

ఆయింట్లో ఏవస్తువు ఎక్కడుంటుందో ఆయనకి తెలియదు. అలాంటి పరిస్థితుల్లో నేనిక్కడ వుండిపోతే ఎలాగు చెప్పు. నేను లేకపోతే ఆయన వేళకి అన్నం తినటం కూడా మానేస్తారు. మాసినబట్టలు వేసుకునే ఆఫీసుకి వెళ్ళిపోతారు. అలమారు తీసుకుని ఇస్త్రీబట్టలు తీసుకోవటంకూడా ఆయనకు చేతకాదు. అసలే ఇంట్లో గడిపేకాలం కొద్ది. నేనుకనక లేకపోతే అసలు ఇంటిముఖమే చూడరు," అంటూ చాలా చెప్పింది. తల్లి అంత దుఃఖంలోనూ కూతురు కాపరంలోని అన్యోన్యతకి మురిసిపోయింది.

"పోనీలే తల్లీ నీయింటికి నువ్వువెళ్ళు" అంది ఆమె.

తల్లి చనిపోయిందని తెలిసినప్పుడు నారాయణి ఈసంఘటన గుర్తుకు తెచ్చుకునే చాలాకాలం బాధపడింది. ఇలా కన్నతల్లినే కష్టసమయంలో దూరం చేసుకోగలిగిన నారాయణమ్మ తన విశ్వాసాన్ని సహస్రాంశమైనా భంగపరుచుకోకుండా ఇన్నాళ్ళనించీ కాపరంచేస్తోంది. భర్తను "ఇలాగైతే ఎలాగు చెప్పండి" అనే తూస్కారపూరితమైన మాట ఎన్నడూ ఆమె అనలేదు. ఆమె మనోఫలకం మీద లిఖించుకున్నమంత్రం: ఎలా జరుగనున్నది అలా జరుగుతుంది, అంతా భగవంతుని ఇచ్ఛ—ఇది. ఈనెల యింతే జీతం ఇస్తున్నాను అని ఆయన చెప్పనుకూడా చెప్పకుండా సగానికిసగం ఖర్చుచేసి మిగిలింది చేతిలో పెట్టినప్పుడు "పోనీలెండి ఎలాగో గడుపుకుందాం" అనేది నారాయణి. అక్కడికీ ఆమె చాలా బాధపడి ఆ "ఎలాగో" అనే నీరసమైనపదం పొరబాటున దొర్లినందుకు మనసులో వందలిట్టుకుని భర్త మనసు ఎక్కడ నొచ్చుతుందో నని, "దివ్యంగా వెళ్ళిపోతుంది. ఏమీ ఫర్వాలేదు" అని మళ్ళీ సర్దిచెప్పేది. అవునుగాబోలు అంతకంటె ఎక్కువడబ్బు ఈ సంసారానికి అనవసరంకాబోలని ఆయన అనుకుని ప్రతినెలా ఇంచుమించు అలాగే ఇస్తూంటారు. నారాయణి ఏనెలా ఇల్లుగడవటం అన్నది ఇబ్బందిగా వున్నదని తెలిసినా ఎన్నడూ ఎదటపడి "రెండొందలు జీతం తెస్తున్నారుకదా ఇలా ఎనభైలూ తొంభయిలు ఇస్తే ఎలాగు చెప్పండి. ఇంత సంసారం గడవాలా?" అని అడగదు.

ఇలాగే నాలుగురాళ్ళు వెనక వేసుకుందాం. ముందు ముందు అవసరం వస్తుంది. పిల్లలుగలవాళ్ళం" అనే ముందుదృష్టిలేకుండా ఆ సంసారం నెట్టుకొస్తున్నారు.

ఒకటి రెండుమార్లు కూతురు వివాహప్రసక్తి నారాయణి తీసుకొచ్చినప్పుడు వీరభద్రంగారు అవును చెయ్యాలి అన్నారంతే. అంతకుతప్పించి తానుగా ఆందోళనపడి పూనుకుని నడుంకట్టుకుని వరునికోసం అంటూ వెతికినపాపాన పోలేదు. తానుగా ఆ ప్రసక్తి ఎన్నడూ తేవటం వుండదు. 'ఈలోకంలో నాకు కావల్సిందల్లా వేళకిభోజనం, రాత్రి పేకాడుకుందుకు క్లబ్బూ—ఈ రెంటికి మించినది మరొకటి లేదు నాకు.' అన్నట్టుగా వుంటారాయన. ఆయనకి మొదట్నించీ అలా సాగుతోంది. మొదట్నించీ కూడా నారాయణి ఎక్కడికక్కడ సర్దుకుపోయే మనస్తత్వంతో ఇదివుందీ - ఇదిలేదు—ఇలాంటి ఇంటి బాధ్యతలు కూడా అంతా తనమీదనే వేసుకుని పొరుగింటి అబ్బాయిని, పనిమనిషిని బ్రతిమిలాడి, మంచి చేసుకునో, అణాలూ, బేడలు ముడుపుపెట్టో ఇంటికి కావల్సినవి తెప్పించుకుంటూంటుంది. ఇప్పటికీ అంతే, ఈవిధమైన పరిసరాల్లో ఆయన మనసు మరింత సంకుచితమైపోయింది. తను ఇంటి బాధ్యతలు పట్టించుకోకపోవటంవల్ల కలిగే ఇబ్బందిని ఆయన వూహించలేకపోయారు...అలా వూహించే అవసరం లేకపోయింది. దాంతో ఆయనకి సంసారం అంటే సరైన దృక్పథం లేకుండాపోయింది. జీవితంలో అతి ముఖ్యమైన బాధ్యతల విషయంలో ఆయనకి చాలా చులకనైన, తేలికైన అభిప్రాయాలు ఏర్పడిపోయాయి. ఎవరన్నా ఈ సంసారం ఈదలేక చస్తున్నాను! అంటె ఆమాట ఆయనకి చాలా హాస్యాస్పదంగా తోస్తుంది. వీళ్ళంతా తెలివితక్కువవాళ్ళు అన్నట్టుగా ఆయన తేలిగ్గా నవ్వేస్తూంటారు. ఆయనకున్న పెద్ద బాధ్యతల్లా క్లబ్బు నిర్వహణ. అది సక్రమంగా సాగుతుందా లేదా, ఎవరెవరు చందాలు సరిగ్గా నెలవారీగా చెల్లిస్తున్నారు, ఎవరెవరు ఎగవేస్తున్నారు? ఇదిచూసుకోవటంవరకే. అందులో ఆయన ప్రస్తుతం కార్యదర్శి పదవి నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరోజు ఆ లెక్కలు చూసుకోవటంలోనూ, ఒళ్ళు తెలియకుండా తాగి పేక ఆటలో తగువులాడుకునే వాళ్ళని చాకచక్యంగా సర్ది

ఏ ఒక్కరూ క్లబ్బుమీద అవిశ్వాసం ప్రకటించి సభ్యత్వానికి రాజీనామా ఇవ్వకుండా చూసుకోవటంలోను ఆయన బుద్ధి చాలా, పదునైనదని చాలామంది కార్యవర్గ సభ్యులు ఆయన్ని వుబ్బితబ్బిబ్బు చేసేస్తూంటారు. సహజంగా కొస్త ప్రశంసలకి వుబ్బిపోయే తత్వంగలమనిషి కావటంవల్ల ఆయన తన బాధ్యతను మరింత శ్రద్ధగా పట్టుదలగా నిర్వహిస్తూ అవసరమైతే ఒక్కొక్కనాడు ఇంటిముఖమే చూడకుండా గడిపిన సందర్భాలుకూడా లేకపోలేదు. ఇల్లు వదిలిపెడితే ఇంతబాధ్యతా భరించగలిగే వీరభద్రంగారు ఇంట్లోమటుకు కనీసం ముఖం కడుక్కుందుకు నీళ్ళయినా ముంచుకోలేరు. అదీ నారాయణి అందివ్వాల్సిందే. ఈ పద్ధతిలో కించిత్తు లోపం జరకూడదు. అసలు జరగదుకూడాను. ఆయన ఇంట్లో వుండే ఆ పదినిముషాలుకూడా, ఆ క్లబ్బుగోడవలే కథలు కథలుగా చెబుతారు. నారాయణి ఆయన మనసు ఎక్కడ చిన్నబోతుందోనని ఒక చెంప నిద్రకమ్ముకుని వస్తున్నా అణచుకుంటూ ఎంతో శ్రద్ధగా వింటున్నట్టుగా నటిస్తూంటుంది. తానుగా ఈ సంసారంలో ఇది వుంది, ఇది లేదు, ఈ పెళ్ళికెదిగిన అమ్మాయి సంగతేమిటి? అనికూడా ఆమె నోరువిప్పి అడగదు. ఆయనంతట ఆయన ఇటువంటి విషయాలు అంత ముఖ్యమైనవిగా పట్టించుకోరు: ఒక్క ముక్కలో చెప్పాలంటే నారాయణికి గడిచిన నిమిషంతోగాని- గడవబోయే నిమిషంతోగాని అంతగా ప్రమేయం పెట్టుకోదు. నడుస్తున్న క్షణంలోనే ఆమె ఆలోచనలు పరిమితమై వుంటాయి. నారాయణిలోని ఈ అద్వితీయ గుణసంపద చాలామంది స్త్రీలని ఆకర్షించింది. వాళ్ళంతా ఆమెను తెగ అభినందిస్తూంటారు. ఆదర్శప్రాయమైన వ్యక్తిగా ఆమె నలుగురి మన్ననలనీ పొందగలిగింది. "ఏదో ఇలాగ కాలం వెళ్ళిపోతేచాలు, అన్నట్టుగా నిర్లిప్తతగా, గంభీరంగా ఆమె నవ్వే నవ్వులోని గర్వపాంకాలకి ఆ నారీలోకం అంతా ముగ్ధులైపోతూంటారు. అలా ఆమె నవ్వినప్పుడే పార్వతమ్మగుండెలు చెరువైపోతాయి. ఆమె మనసు భయభ్రాంతమై కుతకుతలాడిపోతుంది. కాని ఏమీ అనలేక, ఈ అమాయికత్వానికి దిగులుపడుతూ అనూరాధని గట్టిగా హృదయానికి హత్తుకుంటుంది. "జీవితంతో చెలగాటాలాట్టం చాలా ప్రమాదం. ప్రతిక్షణం ఎంతో దూరదృష్టితో మసులుకున్నా కష్టాలు తప్పవు. అలాంటిది ఇంత నిర్లక్ష్యంగా వుంటే ఎలాగమ్మా? ఎలాగు చెప్పు. ఈ రోజులు ఎలాంటివి.?" అంటుంది పార్వతమ్మ. అనూరాధ కళ్ళల్లోకి చూస్తూ తన చెంపలు చెరువు చేసుకుంటుంది పార్వతమ్మ.

ఇవాళ ఏమైనాకానీ, ఎవరేమనుకున్నా తన హద్దుమీరి ఒకవిషయం గట్టిగా అడగాలనుకున్నది పార్వతమ్మ. రాత్రి భోజనాలదగ్గిర తనమనస్సులోని విషయాన్ని వెళ్ళగ్రక్కింది.

"అవునుగాని ఎన్నాళ్లని అమ్మాయిని ఇలా వుంచుకుంటాం నాయనా! దాన్ని ఒక ఇంటిదాన్ని చెయ్యవద్దూ?" అంది.

నారాయణి ఏమీ మాట్లాడలేదు.

ఈ కూతురుపెళ్ళి ప్రసక్తి తెచ్చినప్పుడల్లా వీరభద్రంగారికి చాలా ఇబ్బందిగా వుంటోంది. ఈ ప్రస్తావన ఆయన కంతగా రుచించలేదు కాబోలు ముఖం చిట్లించి "అవును చెయ్యాలి మరి" అన్నారు ముక్తసరిగా.

"చెయ్యాలంటే అందుకు గట్టిప్రయత్నం వుండవద్దూ?"

ఏదీ కలసిరావటంలేదు. ఈ ఉద్యోగంతో అసలు తీరటంలేదు." అన్నారాయన అయిష్టంగానే.

"కలిసిరావటానికి మనం చేసిన ప్రయత్నం ఏముందసలు? వాటంతట అవి వస్తాయా? ఎంత శ్రమపడితే కుదురుతాయి. ఎరికలోవున్న సంబంధం ఏదైనా వుందా?" అంటూ ఆమె ఆయన విసుక్కు తగ్గట్టుగానే రెక్కించసాగింది.

ఒకవిధంగా ఈ ప్రశ్న పరంపర ఆయన్ని చాలా ఇరకాటంలో పెట్టాయి. ఆయన ఏమీసమాధానం చెప్పకుండానే "నేనుపెద్దదాన్ని కాబట్టి చనువుతీసుకొని చెబుతున్నాను. ఏమీ అనుకోకు నాయనా. ఇన్నాళ్లనుంచి చూస్తున్నాను. నీకసలు బొత్తిగా ఇంటిబాధ్యత లేదు. అసలు పదహారేళ్ళ కూతురు పెళ్ళికి ఎదిగి వుందనే ధ్యాసే నీకు వున్నట్టు తోచడంలేదు. ఎన్నాళ్ళని ఇలా సాగుతుంది నాయనా! కాస్త ఆలోచించుకోవద్దూ" అంటూ ఆమె తన వునికినే విస్మరించి మాట్లాడే సాహసం తెచ్చిపెట్టుకుంది. ఈ మాటలు ఎంతవరకూ పని చెయ్యాలో అంతవరకూ పని చేసాయి.

ఆయన "పెళ్ళి చెయ్యాలంటే బోలెడంత డబ్బు కావద్దూ. మన దగ్గర అంత డబ్బు లేదుగా" అన్నారు.

తను చాలా తేలిగ్గా జవాబు చెప్పావని ఆయన అనుకున్నారు.

"అవును కావాలి. అందుకని పెళ్ళి మానుకుంటామా?" ఎక్కడైనా అప్పన్నా తెచ్చి చెయ్యాలి. నేనింతగా ఎందుకు చెబుతున్నానంటే మనం ఏదైనా ఒక మంచి సంబంధం చూసి ఆపిల్లని ఓ ఇంటిదాన్ని చెయ్యాలి. లేదా దాని రెక్కలమీద అది ఆధారపడగలిగే అర్హతయినా ఆమెకి మనం కల్పించాలి. వూరికే ఇంట్లో పెట్టుకునే బదులు చదివించినా బాగుండేది. ఏదీ లేకుండా ఆమె జీవితం ఏవిఁకాను. ఇలాంటి సమస్యలు జాగ్రత్తగా ఆలోచించుకుని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకోవాలి. ఆడపిల్ల ఎదిగినకొద్దీ పెళ్ళిళ్ళు కావటం కష్టమైపోతుంది. ఇంత నిర్లిప్తతగా వుండటం ఏవీఁ బాగాలేదు." తలుపు వారనుంచి అనూరాధ గాజులగలగలలు విని ఆమె అతి ఉద్విగ్నంగా "అతిముఖ్యమయిన విషయాలపట్ల ఇలా పట్టించుకోకుండా బాధ్యతారహితంగా తోసుకు తిరగటం చాలా ప్రమాదం నాయనా...చాలా....ప్రమాదం..."

"ఏమిటో ఆప్రమాదం?" అన్నారాయన చాలా తేలిగ్గా.

"నీకు అర్థంకాదు నాయనా. నాకు తెలుసు"అని ఆమె కంట నీరు పెట్టుకుని ఎవరూ గమనించకుండా ముఖం చాటుచేసుకుని తుడుచుకుంది. వీరభద్రంగారు ఈమనిషిధోరణికి చిరాకు పడుతూ "ఏప్రసక్తి తీసుకురావటానికైనా సమయాసమయాలుంటాయి. తిన్న అన్నం సయించాలా? అది వంటపట్టాలా? ఏమిటీ గొడవ" అన్నారాయన చేతిలోముద్ద విస్తరిలోకి విసిరి.

భర్తముఖంలోని అసంతృప్తి గమనించిన నారాయణి ఇక సహించలేక "పిన్నమ్మా, ఆయన కూతురు వివాహంగురించి ఆయనకి బాధ్యతే లేదనా నీ అభిప్రాయం. ఆ పాఠాలు నీదగ్గర ఆయన నేర్చుకోవాల్సిన పనిలేదు. అన్నీ అవే జరిగిపోతాయి. దేనికైనా కాలం కలిసిరావాలి. మన ప్రయత్నాలు వృథా." ఈ చవక రకం వేదాంతానికి పార్వతమ్మ "నువ్వుకూడా అలాగే అంటే ఎలాగమ్మా! దేనికైనా మన ప్రయత్నంకూడా వుండవద్దూ. తల్లివై యుండి తొందర చెయ్యటం పోయి నువ్వూ అలాగే ఆ చిన్నదాని భారం భగవంతుడిమీద వేస్తావా?" అంది.

నారాయణికి ఈ వాదనంతా ఒక అప్రస్తుత ధోరణిలా తోచసాగింది. ఆమెకు కూతురు వివాహం గురించి ఆతృతగాని, ఆందోళనగాని లేదని అనుకుంటుకు వీల్లేదు. కాని ఈ సమస్య భర్తమనసుని మటుకు నొప్పించటం ఆమె ససేమిరా అంగీకరించదు. భర్తని రొక్కించి అడిగే అధికారం తనకే లేనప్పుడు ఎవరో ఒక అంతరబాంతరవ్యక్తి ఈ ధోరణిలో మాట్లాడటం ఆమె సహించలేకపోయింది. "ఇప్పుడు కొత్తగా బాధ్యతల గురించి నీదగ్గర తెల్సుకోవాల్సిన అవసరం లేదమ్మా. ఇక ఆప్రసక్తి నువ్వు తీసుకరావద్దు. ఆయన తినే నాలుగు మెతుకులు వంటపట్టాలా? నీపాటి ఆలోచన నాకు లేక నేనాప్రసక్తి తీసుకురావటంలేదని నీ అభిప్రాయమా?" అంటూ నారాయణి చాలా తీవ్రంగా, గౌరవహీనంగా మందలించింది.

"నారాయణీ! నువ్వు నా కూతురు లాంటి దానివి. నువ్వేమన్నా నేను సహిస్తాను. అందులో పిలవని పేరంటంగా నీయింటికి వచ్చి నీ తిండి తింటున్న దాన్ని. ఈ విషయం నాకనవసరం అని మీరు భావిస్తూ వుండవచ్చు, అనూరాధ నీకు ఎంతో నాకూ అంతే. దాన్ని ఒక యింటిదాన్ని చెయ్యండి. ఈమాటచెప్పే అర్హత నాకేకాదు. మీదంపతుల తీరు చూసిన ఏబుద్ధిగల వ్యక్తికైనా ఆ అర్హతవుంది. నారాయణీ! నిన్ను చూస్తుంటే ఒకప్పటి పార్వతమ్మ అద్దంలో మాదిరిగా కన్పిస్తూందిప్పుడు. ఆ పార్వతమ్మే ఈనాడు పిడికెడు మెతుకులకోసం" ఇక ఆపైన మాట పెగలక ఆమె లేచి పెరటిలోకి వెళ్ళిపోయింది.

వీరభద్రంగారు అయోమయంగా భార్య ముఖంలోకి చూసారు. ఆమె అంతకన్న బాధగా భర్త ముఖంలోకి చూస్తూ వుండిపోయింది. "ఊరుకో అమ్మమ్మా! నా గురించి నీకెందుకీ బాధ" అన్న అనూరాధ గొంతువిని భార్యాభర్తల ముఖాలు వెలవెలబోయాయి.

3

నారాయణి యింట్లో సమావేశమైన మహిళా మండలిలో ఆనాడు మనోరమ అనే కొత్త వ్యక్తి అందరికీ పరిచయం చెయ్యబడింది. మనోరమ పచ్చగా కొద్దిగా ఎరుపువారిన జుట్టుతో, పల్చగా, నుదుట తిలకంతో, అతిసాధారణమైన, సామాన్యమైన వస్త్రాలంకరణతో సంసారపక్షంగా వుండే మనిషి. ఆమె మాటల

లోని నైశిత్యాన్ని బట్టి ఆమె హృదయపులోతుని కొలవటానికి ప్రయత్నించిన మొదటి మనిషి పార్వతమ్మ. మిగిలినవారెవరూ ఆ దృష్టితో ఆమెను చూడలేక పోయారు. వారంతా ఆమె చరిత్ర విన్న తర్వాత అందులో ఏ మూల ఏ లోసుగు దొరుకుతుందా అది పట్టుకుని ఆమెని తమ నిశితమైన వ్యంగ్యధోరణికి గురి చేద్దామా అనే దృష్టితోనే ఆమెను పరిశీలించ సాగారు. నీతులు, నియమాలు, శీలం,—వీటి ఆవశ్యకత ఆడవాళ్ళకున్నంతగా మొగవాళ్ళకి వుండదని చాలా మంది స్త్రీల అభిప్రాయం. అందుకనే ఆడవాళ్ళ విమర్శకి ఆడవాళ్ళు గురయినంతగా మొగవారు గురికారు. అక్కడ సమావేశమైన చాలామందికి మనోరమ జీవిత చరిత్రలోని అతి ధీరోదాత్తమైన సంఘటనలూ, సన్నివేశాలూ, అతి నీచాతినీచమైన, అవినీతితో కూడిన తొందరబాటు చర్యగా, బరితెగించిన లక్షణాలుగా తోచాయి. ఆమె ప్రస్తుత స్థితికి మూలమైన కారణాలేవీ వారి దృష్టికి ప్రధానాలుగా తోచలేదు. వారి అభియోగమల్లా ప్రస్తుతం ఆమె లక్ష్యం పట్లనే.

"అయితే చదువుకుందామని ఇక్కడికివచ్చారా?" అంది నారాయణి.

"అవును" అని మెల్లగా సమాధానం చెప్పింది మనోరమ.

"ఆ తర్వాత ఏం చేద్దామని?"

"అవసరమైతే ఏదైనా వుద్యోగం చేస్తాను."

"మరి నీ భర్తమాట."

"అదృష్టం బాగుండి వారికి ఏదైనా కలిసివస్తే మంచిదే. లేకపోతే నా సంపాదనతోనే గడుపుకుంటాం"

"అసలు ఇలా చదువుకోవటంలో నీ వుద్దేశం ఏమిటమ్మా" అంటూ మళ్ళీ మొదటికి వచ్చింది నారాయణి. ఆమెకి మనోరమ చెప్పిందంతా సరిగ్గా బోధపడినట్టు లేదు.

మనోరమకి ఈ ధోరణి చిరాగ్గా వుంది. స్నేహపూరితమైన వాతావరణం ఆమెకి ఇక్కడ కనిపించటం లేదు. ఇదేదో న్యాయవిచారణసందర్భంలా తోచ సాగింది. తన్ని బోనులో నిలబెట్టి వీళ్ళంతా శల్య పరీక్ష సాగిస్తున్నారు. "నేనున్న పరిస్థితుల్లో ఇలా చెయ్యటం తెలివైన పని అని నేననుకున్నాను. నా రెక్కలమీద నేను ఆధారపడగలిగే శక్తి నాకుండాలి. ప్రస్తుతం ఒక్కగానొక్క కొడుకు భవిష్యత్తు చూచుకోవాలి. ఆయనకి జీవితంలో ఇంతవరకూ ఒక వుద్యోగమంటూ స్థిరపడలేదు. నేనుకూడా వారికి భారంగా ఎంతకాలం అని వుండగలను. ఈ చదువు నాకు ప్రాణావసరం" అంది మనోరమ.

"అవునమ్మా నువ్వు చాలా తెలివైన పనిచేశావు" అని మెచ్చుకుంది పార్వతమ్మ. ఆమె ఏదో కొత్త ఆవేశంతో లేచి మనోరమ పక్కగా వచ్చి కూర్చుని ఆమె బుజం నిమురుతూ "బాగా శ్రద్ధగా చదువుకో అమ్మా. నాలుగురోజులు శ్రమపడితే నీ లక్ష్యం ఫలిస్తుంది." అంది ఆప్యాయంగా.

ఈ చర్య నారాయణికే కాదు చాలామంది స్త్రీలకు వెగటుగా తోచింది.

"అయితే నీ చదువు పూర్తి కాకుండానే మీ ఆయనకి ఉద్యోగం దొరుకుతే?" అంది నారాయణి. "దీనికేం చెబుతావు?" అన్నట్టుగా అంతా ఆమెముఖంలోకి చూసారు. ఇన్ని ముఖాలు తన్ని పరివేష్టించటం గమనించి "అయినా చదువుతాను" అంది మనోరమ దృఢమైన స్వరంతో.

ఈ కంఠంలోని పట్టుదల పార్వతమ్మని ఆకర్షించింది. ఆమె వుత్సాహంగా మనోరమ ముఖమువైపే చూస్తూ కూర్చుండిపోయింది.

"ఇందుకు మీ ఆయన ఒప్పుకున్నాడనుకోను" అంది నారాయణి.

"ఎందుకు వప్పుకోరు. ఒక వేళ ఆయన కది అంగీకార యోగ్యం కాకపోయినా ఈ విషయంలో ఆయన ఇష్టాఇష్టాలతో నాకు నిమిత్తం లేదు. నేను చెయ్యదల్చుకున్న పని చేసి తీరతాను. ఈ పట్టుదల నాలో సడలకుండా వుండాలి. ఇది ఒక దీక్ష. "అని మనోరమ క్షణం ఆగి ఎవరూ నిశ్శబ్దాన్ని భంగపరచక పోవటం గమనించి "నాకుమటుకు కట్టుకున్న భర్తనీ, కన్నకొడుకునీ తలావకచోటా వదిలి ఇలా వుండటం మనసా. కాని ఆ పట్టుదల అవసరం. జీవితం అనుకున్నంత సులువైందికాదు. కాలం ఎదురుతిరిగినప్పుడు కాళ్ళూ, చేతులూ తేలేసి చేతకానితనంతో సర్వం భగవంతుడిమీద భారం వెయ్యటం అన్నది అంత తెలివైనపని కాదు. ఆడది ఇలా చదువుకోవటమే మహా అవమానకరమైన పంగతయితే ఇం

కంటె అవమానకరమైన స్థితికి స్త్రీ దిగజారవలసి వస్తుంది. భర్త జీవించి వున్నంతకాలం హాయిగా గడిపిన ఆడవాళ్ళు అనేకమంది అంతిమదినాల్లో నెత్తిన ముసుగు వేసుకుని ఇంటింటికీ తిరిగి తిరిపమెత్తుకున్న వాళ్ళని చూసాను. శీలం అమ్ముకుని బ్రతికినవాళ్ళని చూసాను. రైలుకింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న వాళ్ళని చూసాను. ఇలాంటివి ఎన్నో విన్నాను. మనం బుద్ధిమాంద్యం పెంచుకుని జీవితంలో గౌరవప్రదంగా రోజులు వెళ్ళబుచ్చుకునే అవకాశాన్ని మనం ఎందుకు వదులుకోవాలి. ఇక కొద్దిరోజుల్లో నా ట్రెయినింగు పూర్తయిపోతుంది. ఆతర్వాత అవసరమని తోస్తే వుద్యోగంలో ప్రవేశిస్తాను. అప్పుడిక నేను కేవలం బ్రతకటం అన్నది ఓ సమస్యగా పరిణమింపచేసుకుని ఆత్మహత్యలకు పూనుకోవాల్సిన అగత్యం వుండదుగా." అంది.

ఈ ధోరణి పార్వతమ్మహృదయానికి నాటుకున్నంతగా మరెవ్వరి గుండెలనీ స్పృశించలేకపోయింది. వారికదంతా హాస్యాస్పదంగానూ, తేలిగ్గానూ తోచింది. చేస్తున్న తెలివితక్కువపనిని సమర్థించుకునే వ్యర్థప్రలాపాలుగా వారు అర్థం చేసుకున్నారు. పార్వతమ్మ కళ్ళు చెమ్మగిలటం ఎవరూ గమనించలేదు. ఆమె బలవంతాన అణుచుకుంది. ఆమె ఆపాదమస్తకం కంపించిపోయింది. మనోరమ ఆడిన ప్రతిమాటా తన్ని వుద్దేశించి అన్నట్టుగానే పార్వతమ్మ గిజగిజలాడిపోయింది. విషాదభారంతో ఆమె లేచి అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా అక్కడ్నించి నిష్క్రమించింది. చింతాక్రాంతమైన ఆమె హృదయంలో సముద్రఘోష ఆరంభమయింది. ఉవ్వెత్తుగా లేచిన అలలు ఫెడిల్లున వడ్డున విరుచుకుపడ్డట్టుగా ఆలోచనలు మథించసాగినాయి. గదిలోకి నడిచి తలుపు దగ్గరగా వేసి నేలమీదపడి వెక్కి వెక్కి ఏడ్చింది. ఏడ్చిఏడ్చి అలాగే సొమ్మసిలినట్టుగా పడిపోయింది. తిరిగి ఆమెకు స్పృహవచ్చి లేచేసరికి ఎదురుగా తన వంక ఆత్రుతగా చూస్తున్న అనూరాధ అగుపించింది. ఆవారనే మనోరమ కూడా వుంటటం గమనించి లేచి కూర్చుని చీర చెరగుతో ముఖం తుడుచుకుంది.

"మీరు పడుకున్న తీరుచూస్తే అది నిద్రలా లేదు. వంట్లో ఏదో తేడా వచ్చినట్టుంది. ఇప్పుడు తగ్గిందాండి" అంది, మనోరమ, ఎంతో పరిచయంవున్న మనిషిలా.

పార్వతమ్మ "అవునమ్మా వళ్ళు తిప్పింది. ఇప్పుడు తగ్గింది" అంది.

"నే నన్నమాటలు మీకు కష్టం తోచివుంటే క్షమించండి. నేను మూర్ఖురాల్ని. మీ ఎదట నేనలాంటి ధోరణిలో మాట్లాడ్డం తెలివితక్కువ కాకపోతే మరేమిటి? మీగురించి కొంత విన్నాను. మరి కొంత నేను వూహించాను." అంటూ ఆమె పూర్తి కానివ్వకుండానే అర్ధాంతరంగా అందుకొని "అవునమ్మా నువ్వు వూహించింది నాకు తెలుసు. అదంతా నిజం. నువ్వు సరిగానే వూహించావమ్మా. నువ్వన్న మాటల్లో ఏమీ తప్పులేదమ్మా. ఎక్కడ కుళ్లు కనిపించిందో అక్కడ వేలుపెట్టి చూపించావు. నువ్వు బాగా చదువుకుని నీ పట్టుదల నెగ్గించుకుని ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తివి కావాలమ్మా. నువు నెగ్గతావనే ధైర్యం నాకుంది. మా అనూరాధ కూడా ఇలా చదువుతే బాగుండును" అంది పార్వతమ్మ.

"అవును అమ్మమ్మా! నాకూ చదువుకోవాలనే వుంది. కాని అమ్మకి తెలుస్తే ప్రాణాలు తీసేస్తుంది" అంది అనూరాధ.

మనోరమని ఈ ఇంటి మనుష్యుల్తో పరిచయం చేసిన ఆమె ఇంటావిడ గుమ్మంలో నిలబడి 'మనోరమా! పోదాం వస్తావా?' అంది. మనోరమ లేచి 'వస్తానండీ' అని సెలవు తీసుకుని అనూరాధ పెట్టిన బొట్టును సరిచేసుకుంటూ వెళ్ళిపోయింది.

అనూరాధ ఆమెను సాగనంపటానికి వీధివరకూ వెళ్ళింది. పార్వతమ్మ లేచి కిటికిదగ్గరకు నడిచి కిటికీ గజాలు పట్టుకుని భారంగా ముందుకు వంగి "ఇంత కంటె విశ్రాంతి లభించేచోటు మరొకటి లేదూ? నా రెక్కలమీద ఆధారపడి నేను జీవించలేనూ" అని ఆలోచించింది.

"ఏమిటి మాయదారి చదువులోనమ్మా! నిక్షేపం లాంటి సంసారం వదిలిపెట్టి, ఒక కొడుకుని కని కూడా ఇప్పుడు చదువులేమిటి నా ముఖం. అడిగేవాడు లేకగాని అంతా కిరస్తానీ సజ్జుగా తయారవుతున్నారు. అదే మనం అయితే ప్రాణం వున్నా పోయినా ఇంట్లోనే పడివుంటాంగాని ఇలా సంసారాలు వదులుకుని పరాయి వాళ్ళ ఆర్జన మీదపడి చదువులు వెలగబెట్టటానికి సాహసిస్తామా. ఒకళ్ళని అనేపనే

ముంది. ఈరోజులే అలాగున్నాయి. మొగుడికి ఇప్పుడు వుద్యోగం లేకపోతే ఇక ముందు దొరకదూ? అందుకని తను బరితెగించి వీథిని పడుతుందా? ఛా! ఎంత సిగ్గుమాలిన మనుషులమ్మా! పాపం పండిపోయింది. వుండు చెల్లీ దొడ్లో కాసిన చిక్కుడు కాయలున్నాయి. ఇస్తాను పట్టుకెళ్దువుగాని"—ఈ నారాయణి గొంతు రానురాను దగ్గర కావటంతో పార్వతమ్మ సర్దుకుని కళ్ళు తుడుచుకుని ఏదో పనిలో వున్నట్టుగా మంచం మీద దుప్పటి తీసి దులిపి పక్క వెయ్యసాగింది.

అవతలావిడ నారాయణి వాదానికి తాళం వేస్తూ "పాడుకాలం వచ్చిపడిందక్కా. మన చిన్నతనాల్లో గుమ్మందాటి వీధిముఖాలు చూచి ఎరుగుదుమా? మగవాళ్ల మాటకి ఇప్పటికి ఎదురు చెప్పటం వుందా? ఆ రోజులు, ఆ భక్తి ప్రపత్తులూ, వినయ విధేయతలూ మట్టూ మర్యాద ఇప్పుడన్నీ మంట గలిసాయి. కాకపోతే కట్టుకున్న మొగుడ్ని, కన్న పుత్రవాడ్ని వదిలిపెట్టి తగుదునమ్మా అంటూ తమ్ముడుగారింట్లో పడి చదువులు వెలగబెట్టటానికి ఎన్నిగుండె లుండాలి. ఆడజాతికి చేటుకాలం దాపురించిందక్కా. అసలు మన పెద్దలు చెబుతూంటారే అలాగ ఈ కలియుగం బద్దలయిన పాపంలో ఇంకెంత కాలమో వుండదు. సర్వం నాశనం అయిపోతుందక్కా. ఇంతటి పాపభారాన్ని భూదేవి ఎన్నాళ్ళని మొయ్యగలుగుతుంది" అని ఆమె నారాయణి ఇచ్చిన చిక్కుడు కాయల సంచీపట్టుకుని వెళ్ళిపోయింది.

దీపాలవేళయింది. అనూరాధ దీపం చిమ్నీలు తుడుస్తూంది. నారాయణి పెరటిలో స్నానం చేస్తూంది. మడికట్టుకుని గాని వంటచెయ్యదు నారాయణి. పొద్దుపోయే వరకూ పొయ్యిలో నిప్పు వెయ్యదు. రాత్రి పొద్దుపోయి భర్తవచ్చే సరికి వండిన అన్నం చల్లారి పోతుందని ఆలస్యంగా వంట ప్రారంభిస్తుంది. పిల్లలకి కూడా బాగా పొద్దు పోయిం తర్వాత తినటం అలవాటయిపోయింది. ఇవాళింకా చంద్రుడు ఆటలు అయి యింటికి రాలేదు. వాడిని అదుపులో పెట్టేవారే లేరు. రాత్రి ఒక్కొక్కప్పుడు బాగా చీకటి పడిందాకా వాడు ఇంటికిరాడు. అల్లరి చిల్లరగా ఏ కాలవగట్లమీదనో, తోటల్లోనో పడి అల్లరి చేస్తూంటాడు. అదుపులేక వాడి అల్లరి మితిమీరి పోయింది. అప్పుడప్పుడు ఇరుగుపొరుగు వాళ్ళు వాడి మీద ఫిర్యాదులు తెచ్చి నారాయణితో చెబుతుంటారు అయినా నారాయణి వాడ్ని మందలించదు. ఎందుకంటె వాడంటేభర్తకి చాలాగౌరవం ప్రేమ.అందుకని వాడ్ని ఏమీ అనటం ఆమెకు ఇష్టంవుండదు. వాడిని ఏమన్నా భర్త మనసు కష్టపడుతుంది. మీ వాడు మా పిల్లల్ని కొడుతున్నాడని, తిడుతున్నాడని ఎవరైనా ఫిర్యాదు చేస్తే నారాయణి వాళ్ళనే నాలుగు ఎదురు మాటలని పంపించేస్తుంది. వాడికప్పుడే ఏడేళ్లు నిండుతున్నాయి. అయినా వాడ్ని ఇంతవరకూ బడిలో వేయించ లేదు. అనూరాధ అప్పుడప్పుడు వాడ్ని దగ్గర కూచోబెట్టుకుని తనకు వచ్చిన నాలుగు ముక్కలూ చెప్పబోతుందిగాని వాడి తింగరతనానికి ఆమె తట్టుకోలేక వాడిమానాన వాడ్ని వదిలేస్తుంది. ఇకపోతే నారాయణి, ఎంతసేపూ మడీ, ఆచారమూ, వంటలూ, వార్పులూ సాయంత్రం అమ్మలక్కలతో ముచ్చటలూ వీటితోనే సరిపోతుంది. వాడి చదువుగురించి శ్రద్ధపట్టే అవకాశమే ఆమె కుండదు. ఇక వీరభద్రంగారి సంగతి సరేసరి. ఆయన బాధ్యతలూ,ఇష్టాలు దేశానికి సంబంధించినవై వుంటాయి గాని ఇంటికి సంబంధించినవి కావు.

ఇలా ఒక మూర్ఖమైన వాతావరణం ఆ యింట్లో వ్యాపించి పోయింది. దానికి విరుగుడంటూ లేదు.

చంద్రుడు వళ్ళంతా మన్ను చేసుకుని గెంతుకుంటూ నేరుగా వంటగదిలోకి దూరబడ్డాడు, దారి పొడుగూతా దుమ్ము దులుపుకుంటూను. అనూరాధ "అయ్యో వీడ్ని చూడమ్మా వళ్ళంతా దుమ్ముచేసుకుని కడుక్కోకుండానే ఇంట్లోదూరబడి ఇల్లంతా దుమ్ము చేస్తున్నాడు" అంటూ అరిచింది. అయినా వాడు లక్ష్యపెట్టలేదు. పైపెచ్చు నేరుగాపోయి వంటగదిలో పొయ్యిమీద వేగుతూన్న కూరముక్కల్ని గరిటతో తీసి రుచిచూడ సాగాడు.

అనూరాధ చప్పున వాడిని వీపుమీద చరిచింది. ఒక్కమారు వాడు కెవ్వు మనగానే పెరటిలోంచి నారాయణి, ముందు గదిలోంచి పార్వతమ్మా ఒకేమారు వంట గదిలోకి వచ్చిపడ్డారు కంగారుగా.

"చూసావా అమ్మా వీడుచేసినపని. వీథులన్నీ తిరిగి వళ్ళంతా బాడి చేసుకుని అలాగే వచ్చి కూర ముక్కలు రుచిచూస్తున్నాడు" అంటూ ఫిర్యాదు చేసింది అనూరాధ.

"అందుకని నువ్వేం చేశావు వాడ్ని?"—ఈ కంఠంలోని తీవ్రతకు అనూరాధ నివ్వెరపోయి నిరుత్తరరాలై నిలబడిపోయింది.

ఈ అవకాశం జారవిడువకుండా చంద్రుడు గొంతు మరింత పెద్దదిచేసి 'కొట్టిందమ్మా! చూడు! ఎలా తట్టు తేలిపోయిందో' అని ఏడుస్తూనే వాడు చొక్కా పైకెత్తి వీపు చూపించాడు.

నారాయణి కంగారుగా వాడివీపు నిమురుతూ "ఎంతపనిచేశావే! నీ పెద్దరికం పాడుగాను. కుర్రకుంక ఏదో తెలియక తప్పుచేస్తే అంతలా బాదుకోవటమా! అవి చేతులా మరేమన్నానా? వూరుకో నాయనా... అక్కని నే కొడతాలే...ఏడవకు...అయినా వాడ్ని అలా బాదటానికి నీకెవరిచ్చారంట అధికారం. ఈమారు ఇలాంటి పని చేసి చూడు వీపు చీరుస్తా ఏమనుకున్నావో" అంటూ మిరపకాయలు వేయించినట్టుగా నాలుగూ దులిపేసింది నారాయణి.

అనూరాధ ముఖం చిన్నబోయింది. అభిమానంతో కళ్ళు నీళ్ళ పర్యంతం అయింది. కాని ఎదురుగా తనవైపే చూస్తూ ముక్కుమీద వేలు వేసుకున్న పార్వతమ్మని చూడగానే అక్కడ్నించి కదిలి ముందు వసారాలోకి నడిచింది. ఈ సంఘటనలో అంతగా కలత జెందవలసినఅగత్యం లేకపోయినా అనూరాధమటుకుమనస్సు పాడుచేసుకుంది. ఆమెకి ఒక్కమారు "తనకి పెళ్ళయి వుంటే ఎంత బాగుండేది" అనే ఆలోచన ఎందుకో తట్టింది.ఆవయస్సు అలాంటిది.అప్పుడు వచ్చేవూహాలూ అలాగే వుంటాయి.రాత్రి పడుకోబోతూకూడా పార్వతమ్మ నేత తనదేమీ తప్పులేదని పదిమార్లు చెప్పించుకునేవరకూ ఆమెకు మనశ్శాంతి లేకపోయింది.

"మరేవీఁలేదు అమ్మమ్మా. వాడల్లా అల్లరిచిల్లరగా తిరిగి చదువుకోవటం మానేస్తే వాడేమయినా బాగుపడాలా? ఎనిమిదేళ్ళు వచ్చాయి. వాడి కింతవరకూ అ, ఆలు రావు. వాడికి సిగ్గయినా లేదు. అమ్మా, నాన్నా కూడా వాడికి తగట్టే వాడేంచేసినా వాళ్ళు చూస్తూ వూరుకుంటారు. పిల్లల్ని కాస్త మందలించకపోతే వాడేంబాగుపడతాడు! ఇవ్వాళ మటుకు వాడు ఎలాంటి పని చేసాడో నువ్వు చూశావా? వాడు చేసిన పని బాగుంది గాని నేను చెయ్యిచేసుకోవటం బాగుండలేదన్నమాట. అసలు నాకెందుకులే" అంది అనూరాధ.

పార్వతమ్మ బదులుచెప్పలేదు. ఆమెమనసు మనోరమ వైపు పోయింది. అంతిమంది స్త్రీలమధ్యని సగర్వంగా ఆమె చెప్పిన జవాబులు, ఆవెనక ధ్వనించిన పట్టుదల, ఆ నుదుటిమీద ముడతలలో వ్యక్తమయిన దృఢత్వం, ఆ చైతన్య స్రవంతి తెరలు తెరలుగా గుర్తుకు తెచ్చుకోసాగింది. వీరరస ముట్టిపడే ఆ మూర్తి పార్వతమ్మ హృదయంలో చెరగని ముద్రవేసి హత్తుకుపోయింది. ఇన్నాళ్లకు తను వూహించిన ఒక మనిషిని యథార్థంగా చూడగలిగింది. జీవితంపట్ల మనోరమకి వున్న దూరదృష్టి, విశ్వాసానికీ పార్వతమ్మ ఆమెను పదేపదే అభినందించింది. జోహారు లర్పించకుండా వుండలేకపోయింది.

"ఏవిటమ్మమ్మా ఆలోచిస్తున్నావు?" అంది అనూరాధ

"మనోరమనుగురించి నీ అభిప్రాయం ఏవిఁటమ్మా?"

"ఏముంది? సరదా అయిన మనిషిలాగా నేవుంది"

"అంతేనా! అంతకు తప్పించి మరేవీఁ విశేషం లేదా?"

"ఏమిటది?"

"మనోరమ ఆదర్శప్రాయమైన స్త్రీ. ఆమెలాంటి వాళ్లు చాలాకొద్దిమంది వుంటారు. జీవితం విలువ తెలిసినవారు ఎప్పుడూ గౌరవించదగిన వారు కారూ? ఆమె ధోరణిలో నిశ్చలత, దీక్ష ఎలా ధ్వనించాయో విన్నావా?"

"అయితే మనోరమ కూడా చదువుకుని వుద్యోగం చేస్తుందా అమ్మమ్మా?"

"అవసరమైతే చేస్తుంది. అయితే అందుకు అర్హత సంపాదించుకోగలగటం అన్నది విశేషం కాదూ? నువ్వుకూడా మనోరమ దగ్గరకు పోయి చదువుకోరాదూ వృత్తినే ఇలా కాలక్షేపం చెయ్యకపోతే."

"అమ్మో! అమ్మ చంపేస్తుంది"

గడియారం పదిగంటలు కొట్టింది. అనూరాధ గంటలు లెక్క పెడుతూంది.

"ఇంకా మీనాన్న ఇంటికి రాలేదు కదమ్మా?"

"లేదు"

భారంగా నిట్టూర్పువిడిచి పక్కకు వత్తిగిలింది పార్వతమ్మ. వీధి మొగలో రావిచెట్టు'జంయ్'మంటూ గోల చేస్తూంది. వూరంతా మాటుమణిగినా నారాయణి

మటుకు కమ్ముకువస్తున్న నిద్రని అణుచుకుంటూ వుండీ వుడిగీ వినవచ్చే ప్రతి చిన్న సవ్వడికీ, భర్త వచ్చారేమోనని వీథివైపు చూస్తూ ఆవులించి చిటికెలు వేసుకుంటూంది.

ఆమె ఇక ఆగలేక ఓ నిద్రతీసి లేచింతర్వాత గడియారం ఒంటిగంట కొట్టటం భర్త తలుపు తట్టటం ఒక్కమారు జరిగింది.

4

రాత్రి ఏ నిశ్చయానికి వచ్చి పడుకుందో పార్వతమ్మ తెల్లవారి అది ఆచరణలో పెట్టింది. అందుకనే ఇంట్లో ఎవరూ లేవకుండానే ముందుగానే లేచింది. కుంపటి రాజేసి కాఫీ నీళ్లు పడేసింది. ముఖం కడుక్కుని పనిమనిషి రాగానే అది అరవ నవసరం లేకుండానే అంట గిన్నెలన్నీ బైటవేసింది.

పనిమనిషి కేక బెడితేగాని నారాయణి లేవదు. ఇవాళ ఆమె లేచేసరికి కొద్ది పొద్దెక్కింది. కళ్ళు నులుపుకుంటూ వంటగది సమీపించేసరికి మొదటి చూపులోనే జరిగిందంతా ఆమె వూహించ గలిగింది. ఆమె గదిలో అడుగు పెట్టగానే "అమ్మా నారాయణీ! నన్నివాళనుంచీ ఈవిషయంలో అడ్డు పెట్టవద్దు. నువ్వు చిన్నదానివి. నీకు తెలీదు. నాబాధ అర్థంచేసుకో తల్లీ" అంది పార్వతమ్మ.

పార్వతమ్మ ఎంతటి దూరపాలోచనతో ఈ మాటలందో నారాయణి గ్రహించినట్లు కనబడదు. అందుకనే ఆమె నిస్సంకోచంగా "అయితే నీ వుద్దేశం ఈఇంట్లో ఒక బలమైన స్థానం నువ్వు అపేక్షిస్తున్నావా పిన్నమ్మా?" అంది.

"నన్ను అర్థం చేసుకోమని పదేపదే వేడుకుంటున్నాను నారాయణీ! నేను నిజంగా ఈబాధ్యతలు నీకు బరువైపోకుండా వుండటానికే నెత్తిన వేసుకోవటంలేదు. కొంత అభిమానమూవుంది. కొంత అవసరమూ వుంది. జీవితంలో దిక్కులేని మనిషినై ఈ ఇంట అడుగుపెట్టాను. నాలుగు మెతుకులు తింటున్నాను. కాని..."

ఈమాట పూర్తవకుండానే అర్ధాంతరంగా అందుకుని "చూసేవాళ్ళ దృష్టిలో కేవలం ఒక చుట్టంగానే కాకుండా బాధ్యతగల ఇంటి మనిషిగా కనబడాలని తాపత్రయం కాబోలు" అంటూ పూర్తి చేసింది నారాయణి.

పార్వతమ్మ నిలువల్లా నీరుకారిపోయింది. ఇవాళ రభస జరుగుతుందని ఆమె ముందుగా వూహించకపోలేదు. అయినా ఈతీవ్రమైన అవమానకరమైన ధోరణి ఆమె సహించలేకపోయింది. ఆమె చేతిలోని తాటాకు విసనకర్ర కిందికి జారిపోయింది.

"భగవంతుడు నాకు రెక్కల్లో కావల్సినంత శక్తి నిచ్చాడు. అది వున్నంతకాలం ఈ ఇంటిమీదకి ఎంతమంది వచ్చిపడినా వండిపెట్టగలను. ఇందులో ఇంకొకళ్ళ ప్రమేయం నేను సహించేది లేదు." అంది నారాయణి నిర్మొహమాటంగా.

ఇక ఏవిధమైన ఆసరా లేని నిస్సహాయస్థితిలో పార్వతమ్మ ఆగది విడిచిపెట్టక తప్పలేదు. అంతవరకూ నారాయణి అక్కడ్నించి కదలలేదు. పార్వతమ్మ ముఖమంతా చెరువు చేసుకుని తనగదిలోకి నడిచి మంచంకింద చిరుగులుపడిన చేతిసంచీ తీసుకుని అందులో తన నాలుగు పాతచీరలూ కుక్కుకుంది. అప్పటికింకా పిల్లలు లేవలేదు. నారాయణి భర్త మెలుకువ వచ్చినా బద్ధకంచేత మంచంమీద అటూ ఇటూ దొర్లుతున్నాడు. కిటికీలోంచి పొద్దుటి ఎండ మంచం మీదకి పాకగానే ఆయన మంచం దిగి వళ్ళు విరుచుకున్నాడు. పార్వతమ్మ గొంతు విని ఆయన గుమ్మం వైపుకి తిరిగారు. గుమ్మంముందు చేతిసంచీలో ఆమె వారగా నిలబడివుంది. "నేను వెళ్తున్నాను నాయనా" అంది.

"ఎక్కడికి?" అన్నాడాయన అయోమయంగా.

"అదే ఇంకా నిశ్చయించుకోలేదు. వచ్చి చాలా రోజులయింది. ఇక వెళ్ళొద్దూ.

"నువ్వనేదేవిటో నా కర్థంకావటం లేదు. అసలేం జరిగింది"

"ఏమీ జరగలేదు. ఇందులో జరగడానికేముంది. వచ్చాను. కొన్నాళ్ళు వున్నాను. మళ్ళీ వెళ్ళిపోతున్నాను. అంతే నాయనా!"

"అవును. ఎక్కడికి పోతావు? అది చెప్పు ముందు."

దీనికి ఏమని చెప్పాలో ఆమెకి బోధపడలేదు. "ఇచ్ఛాపురంలో మా దూరపు చుట్టాలున్నారు. వాళ్ళ దగ్గిరకి వెళ్దామనుకుంటున్నాను."

"ఇప్పుడు నీకిక్కడ ఏం లోటు వచ్చిందని"

"రామ! రామ! అలాగని నేనన్నానా, ఏ లోటూ లేదు. నేను కేవలం చుట్టాన్ని నాయనా. నాలుగు రోజులుండి వెళ్ళిపోతున్నాను. దీనికోసం నువ్వింత బాధపడతావు దేనికి?"

"నారాయణితో చెప్పావా?"

"లేదు చెబుతాను" అని పార్వతమ్మ వెనక్కి తిరగ్గానే వంటగది గుమ్మంలో చేతులు తుడుచుకొంటూ నారాయణి నిలబడివుంది. ఇదంతా ఆమె వినే వుండాలి. నారాయణి దగ్గరగా వచ్చి పార్వతమ్మ చేతులు పట్టుకుని పక్కగా తీసుకెళ్ళి "ఈ డబ్బు దగ్గరవుంచుకో పిన్నమ్మా. నువ్వు అభ్యంతరపెడితే నా మీద ఒట్టే" అంది.

పార్వతమ్మ బలవంతం మీద ఆ డబ్బుతీసుకోక తప్పలేదు. ఆమె అక్కడ్నించి కదుల్తూ పిల్లపెళ్ళి గురించి, పిల్లవాడి చదువు గురించి మరోమారు హెచ్చరించి, పిల్లలు పడుకుని నిద్రపోతున్న గదిలోకి వెళ్ళి లేతఎండలో ముడుచుకుని నిద్రపోతున్న అక్కాతమ్ముళ్ళని చూసి బయటికి నడిచింది. వెనకాల నారాయణి దంపతులు అనుసరించారు. మరోమారు ఆమె శెలవుతీసుకొంది.

"ఇచ్ఛాపురం చేరగానే వుత్తరం రాయి" అన్నారు వీరభద్రంగారు.

ఉదయం సంధ్యని చీల్చుకుంటూ మెల్లగా సాగిపోతున్న ఆమె పూర్తిగా అదృశ్యమయేవరకూ నారాయణి దంపతులు గుమ్మంలో నిలబడి తర్వాత నిట్టూర్పులతో లోపలికి వెళ్ళిపోయారు.

"ఏమిటో పిచ్చికాకపోతే ఇప్పుడెక్కడికని పోతుంది?" అన్నారు వీరభద్రంగారు.

వెనకాల వస్తున్న నారాయణి "అవును నిజమే అనుకోండి. అయినా మనంమటుకు ఎన్నాళ్ళని పోషించగలం? ఏదో రెండు నెలలు వుంచుకున్నాం. మనసు రాయి చేసుకోందే ఇలాంటి విషయాల్లో కష్టం. పిల్లాజల్లావున్నవాళ్ళం. ఖర్చులు పెంచుకుంటే ఎలాగు. అదే మనసులో పెట్టుకోకండి. ఎవరిఖర్మ వాళ్లది. ఏం చేస్తాం" అంది నారాయణి.

ఆనాడల్లా అమ్మమ్మ వెళ్ళిపోవటం గురించి గుచ్చిగుచ్చి వేసే ప్రశ్నలకి చివరికి విసుగెత్తి "చుట్టాలు ఎల్లకాలం మనింట్లోనే పాతుకు పోతారేమిటే. వచ్చి రెండు నెలలు వుండి వెళ్ళిపోయింది. ఆవిడకోసం దిగులు పడతావేమిటి? వెళ్ళి బిందెతో నీళ్ళుతోడి పట్టుకురా?" అంటూ చిరాకుపడే వరకూ అనూరాధ వూరుకోలేదు. అమ్మమ్మ దగ్గర అంతగా చనువులేని చంద్రుడు ఆ ప్రసక్తే తీసుకు రాలేదు.

5

అనూరాధ గుమ్మంలో అడుగుపెట్టగానే చుట్టూతా పరుచుకున్న పుస్తకాలమధ్య కూర్చుని తదేకంగా చదువుకుంటున్న మనోరమ చప్పున లేచి అతి ఆప్యాయంగా ఎదురు వచ్చి లోపలికి తీసుకువెళ్ళింది.

"మా స్నేహితురాలింటికి వచ్చి ఓమారు మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను. మీ చదువుకి భంగం కలగలేదుగదా" అంది అనూరాధ.

"అబ్బే! లేదు. అలాకూర్చోండి. మీవాళ్లంతా కులాసాగా వున్నారా?"

"ఆఁ! మా అమ్మమ్మ వెళ్ళిపోయింది. మీకు తెలుసునా?"

"తెలియదే! ఎక్కడికి?"

"ఎక్కడో ఇచ్ఛాపురంలో వాళ్ళదూరపు చుట్టాలున్నారుట. అక్కడికి వెళ్ళింది."

"అది నమ్మతగిందేనా అనూరాధా. నాకేమీ నమ్మకం లేదు." అంది మనోరమ భారంగా నిట్టూర్పు విడిచి.

"అంటే మీవుద్దేశ్యం?"—అనూరాధ వ్యాకుల హృదయంతో అడిగింది.

"ఆమె కాపాటి ఆసరావున్నట్టు తోచదు" దగ్గర కొద్దిడబ్బయినా వుందా;"

"అమ్మ పాతికరూపాయ లిచ్చింది" అది తప్ప ఆమెదగ్గర మరేమీలేదు. అంతవరకూ నాకు తెలుసు."

"మీ అమ్మ పాతిక రూపాయ లిచ్చిందా?" అంది మనోరమ నమ్మకంలేని స్వరంతో.

అనూరాధ తల వూపింది.

ఈ మనసు అల్లే పాడువూహలనుంచి తెములుచుకుంటూ మనోరమ "మాయిల్లు బాగుందా?" అని ప్రశ్నించింది.

"ఏదీ చూపించకుండానే?"

"అయ్యో నా తెలివితెల్లవారిపోను" అంటూ మనోరమ అనూరాధని వెంటబెట్టుకుని ఇల్లంతా

చూపించింది. ఇంత పెద్ద యిల్లు అద్దెకు తీసుకున్న మనోరమ తమ్ముడి వుద్యోగం తక్కువేమీ కాదని అంచనా వేసింది అనూరాధ.

ఆతర్వాత తను చదువుకునే పుస్తకాలన్నీ పరిచయం చేసింది మనోరమ. ఆమె వుత్సాహం చూస్తుంటే తన్ని ఆమెతో పోల్చుకొని సిగ్గుపడింది.

"అమ్మమ్మ ఓమారు అంది, ఇలా వుత్తినే కాలక్షేపం చెయ్యకపోతే మనోరమదగ్గరకిపోయి చదువుకోరాదా?"అని. మీరంటే ఆమెకి వల్లమాలిన అభిమానం. తరుచు మీ ప్రసక్తి తీసుకువస్తూండేదామె." అంది అనూరాధ ఆస్మృతి రేకెత్తించిన వ్యథతో.

"ఆమె వెళ్ళేముందు నాకు తెలిసిందికాదు. ఒక్కగంటముందు తెలిసినా ఆమెని తప్పక కలుసుకునేదాన్ని. అనేకవిషయాలు ఆమెతో మాట్లాడాలనుకున్నాను" అంది మనోరమ.

"ఆమె వెళ్ళబోయే సంగతి మాకుమటుకు తెలుసునా? ఎవరికీ తెలియదు. ఆమె వెళ్లేసమయానికి నేనూ తమ్ముడూ ఇంకా నిద్రలేవలేదు. పాపిష్టిదాన్ని ప్రతిరోజూ తెల్లవారకుండానే లేచేదాన్ని. ఆనాడు పొద్దుపోయి లేచాను. అమ్మమ్మ వెళ్ళిపోయింది. ఆమె హఠాత్తుగా నిశ్చయించుకుని వెళ్ళిపోయింది. మళ్ళీ ఇక ఆమెనుచూట్టం పడదనుకుంటాను. ఆమెని మరిచిపోయినా ఆమె చెప్పిన కథలు మరిచిపోలేను. ఆమె వెళ్ళింతర్వాత తిక్కెత్తినట్టు అనిపించింది."—అనూరాధ కంఠం కొద్దిగా వణికింది. కళ్లు చెమ్మగిలి ఒక నీటిచుక్క చెంపలమీదుగా జారిపోయింది.

మనోరమ ఆమెను దగ్గరగా తీసుకుని "బాధపడకు అనూరాధా! ప్రతిరోజూ సాయంత్రంపూట ఇలాగ వచ్చావంటే అంతకంటె మంచికథలు చెబుతాను." అంది.

అనూరాధ సిగ్గుపడుతూ అబ్బే వూరికే అన్నాను. నేనేమన్నా చిన్నపిల్లనా కథలకోసం అంటూ ముఖం వాచిపోవటానికి" అంటూ నాన్చింది.

మనోరమ నవ్వుతూనే "నువ్వు చాలా తెలివైనదానివే. ఏమిటో అనుకున్నాను. అయితేనేం రోజూ తస్తూండు. ఖులాసాగా కబుర్లు చెప్పుకుందాం."

అలాగే అన్నట్టుగా తల వూపింది అనూరాధ.

"మాయింటికి పత్రికలు కూడా వస్తూంటాయి" చదువుకోవచ్చు."

"పత్రికలు చదవటం నాకు అలవాటులేదండీ" అంది అనూరాధ.

"అలవాటు చేసుకుందువుగాని."

"మీరు రోజూ చదువుతారనుకుంటాను"

"అవును ప్రతిరోజూ చదువుతాను."

"అంత శ్రద్ధగా చదవటానికి అందులో ఏముంటాయి?"

"ఎందుకుండవు? అనేకవిషయాలుంటాయి. ఒకరోజు కాఫీ తాగకపోతే ఎంతతిక్కగా వుంటుందో ఒక్కరోజు పేపరు చదవకపోయినా అలాగేవుంటుంది" అంది మనోరమ.

అనూరాధకి మనోరమధోరణి ఆశ్చర్యంగానే వుంది.

"నేను ఇవాళనుంచీ సంపాదనాపరురాలినయాను" అంది మనోరమ వున్నట్టుండి.

"ఎక్కడన్నా వుద్యోగంలో ప్రవేశించారా?.

"లేదు, అయిదు ప్రయివేట్లు కుదుర్చుకున్నాను. నెలకో పాతిక రూపాయలు వస్తాయి. ఓ పదిరూపాయిలు అబ్బాయికి పంపుతాను. మిగతా పదిహేనూ ఆయనకి పంపేస్తాను. పైఖర్చుకన్నా వస్తుంది.

"ఆయన ఎక్కడ వున్నారు?"

"ఆయన అన్నగారి దగ్గర"

"మరి మీ సంగతి?"

"నాకు తమ్ముడున్నాడుగా, స్కూలువాళ్లు కొంత 'సయిఫెండు' ఇస్తారు. "తెల్లవారగానే ఆ పిల్లలు మనింటికి వస్తారు. ఓ గంట చెబుతాను. అనవసరంగా కాలం ఎందుకు పాడుచెయ్యాలి. నేను చేస్తున్నపని బాగుండలేదూ?"

"ఎందుకు బాగుండలేదు. దివ్యంగా వుంది" మనోరమ గొంతుతగ్గించి "ఇలా పాఠాలు చెబుతున్నానని చెబితే తమ్ముడు కస్సుమని లేచాడు. అతడ్ని వప్పించి శాంతపరిచేటప్పటికి నా తలప్రాణం తోకకు వచ్చింది. 'నువ్వు పిల్లలకి ప్రయివేట్లు చెప్పి సంపాదించాల్సిన అగత్యం ఏముంది? నే నిన్ను ఇంతగా ఆదరిస్తున్నా నువ్వు నన్ను అర్థం చేసుకోలేదన్నమాట,

చూసేవాళ్లేమనుకుంటారు?' అంటూ నిష్ఠూరాలాడాడు. అన్నిటికి నచ్చచెప్పి "నా సంపాదనకోసం కాదు తమ్ముడూ, నా వాళ్లకోసం; నా సంపాదనలో దమ్మిడీ నేను ముట్టను. నేను పూర్తిగా నీ మీదనే ఆధారపడతాను" అని హామీ ఇచ్చాను. అప్పటికిగాని వాడు మెత్తపడలేదు. తర్వాత ఇందులో తప్పేమీ లేదని వాడూ గ్రహించాడు."అని మనోరమ లేచి గాలికి రెపరెపకొట్టుకుంటున్న పుస్తకాన్ని తీసి అలమారాలో వుంచి తిరిగివచ్చి కూర్చుంది.

"మీతో మాట్లాడుతూవుంటే సరదాగావుంది" అంది అనూరాధ.

"అందుకనే మనం ప్రతిరోజూ కలుసుకుందామని నేనంటున్నాను."

"అమ్మమ్మ వున్నది రెండుమాసాలయినా ఆమె వెళ్ళిపోయింతర్వాత ఏదో పెద్దలోటుగా వుంది. ఆమె తలపుకు వస్తే దిగులు దిగులుగావుంటుంది"

మనోరమ అనూరాధ తల నిమురుతూ "అది మంచిదికాదు. మనస్సు ఎప్పుడూ వుత్సాహంగా వుండాలి. దిగులుపడటం మంచిదికాదు. అలావుంటే ఎవరూ నిన్ను పెళ్ళిచేసుకోరు" అంటూ నవ్వేసిందామె.

ఈ పరిహాసంతో అనూరాధ మనస్సును ఆవరించిన మబ్బులు మంచులా కరిగిపోయాయి. ఆమె సిగ్గుపడి ముఖం ఎఱుపుచేసుకుని "మీదంతా వేళాకోళం" అంటూ దూరంగా జరిగింది.

మనోరమ మరింత బిగ్గరగా నవ్వింది. మనోరమ నవ్వు అనూరాధకి నవ్వు తెప్పించింది.

"ఏమిటి అక్కా అంతలా నవ్వేస్తున్నావు" అంటూ అప్పుడే గదిలో అడుగుపెట్టిన శేఖరం మరో కొత్తమనిషి అక్కడ వుండటంతో నాలికి కొరుక్కుని త్వరత్వరగా బూటుకాళ్లతోనే లోపలికి వెళ్ళిపోయాడు.

అనూరాధ చప్పున నోరు నొక్కుకొని లేచి "వస్తాను" అంటూ త్వర త్వరగా బయటికి రాబోయింది.

మనోరమ నవ్వు నాపుకుంటూ "ఫర్వాలేదు. వాడు వచ్చి మన్నేం చేశాడు? కాసేపు కూచుని వెళ్దువుగాని" అంది.

"లేదు పని వుంది. అప్పుడప్పుడు మీరూ కనిపిస్తూవుండండి" అంది అనూరాధ మెట్లు దిగుతూను.

"నేను అప్పుడప్పుడు వస్తూంటాను. నువ్వు ప్రతిరోజూ రావాలి రేపు ఇదే వేళకి ఎదురు చూస్తూంటాను."

అనూరాధ కనిపించినంతసేపూ చూస్తూ తమ్ముడు గొంతువిని లోపలికి వెళ్లిపోయింది మనోరమ.

"ఈమె మరొక కొత్త శిష్యురాలు కాదు గదా?" అంటూ ఇవతలికి వచ్చాడు శేఖరం.

మనోరమ నవ్వుతూ "ఇంచు మించు అంతే అనుకోవచ్చు" అంది.

"అయితే జీతం ఏపాటి పుచ్చుకుంటున్నావేమిటి?"

"పోరా నీదంతా పరిహాసం. ఏమీ లేదు" అంది మనోరమ.

6

నారాయణి అన్నగారివద్ద నుంచి వుత్తరం వచ్చింది. బావగారి పేర రాసాడాయన.

బావగార్కి నమస్కరించి వ్రాయునది—

ఇవాళ ఇక్కడ మంచి సంబంధం ఒకటి చూశాను. కుర్రవాడు బి. ఎ. చదివాడు. నెలకు రెండొందలు జీతం తెచ్చుకొంటున్నాడు. పదెకరాలభూమి పిల్లవాడి వాటాకు వస్తుంది. ఒక ఇల్లుకూడా వుంది. మూడు నాలుగువేలు ఇవ్వటానికి మనం సిద్ధపడితే వాళ్ళు వప్పుకుంటారని అనుకుంటున్నాను. కాబట్టి నువ్వొకమారు బయల్దేరి ఇక్కడికివస్తే వాళ్ళతో మాట్లాడదాం. నేను ఈ చిరుగుల చొక్కాతో వెళ్ళి పెళ్ళి సంబంధం మాట్లాడితే కలిసేది కూడా కలవదు. లేకపోతే దీనికోసమంటూ ఓ చొక్కా పంచీ కొనుక్కోవాలి. నాకు దాపరికం, సిగ్గూ లేవు సుమా. ఉన్నదున్నట్టుగా రాసేస్తున్నాను. పేదరికం అనుభవిస్తూండగా లేంది చెప్పుకుంటే వచ్చిందా? నువ్వు ఈ విషయంలో కాస్త త్వరపడాలి. ఎదురు చూస్తూంటాను. ఈ సంబంధం కుదురుతే పిల్లదాన్ని గురించి మనకు దిగులు వుండదు."

ఉత్తరం పూర్తవగానే గట్టిగా మూలిగి దాన్ని టేబిల్ మీదికి నెట్టేసారు వీరభద్రంగారు. నారాయణి తీసుకుని చదివి ముందు అభిమానంతో ముఖం ఎరుపు చేసుకుని 'పాడు దరిద్రం మానాభిమానాల్ని కూడా చంపేస్తుంది కాబోలు.' అనుకొని "అదిసరే పోనీ వెళ్ళిరారాదు?" అంది ఆమె.

"నాకెక్కడ తీరికే. ఇవాళనుంచీ క్లబ్బులో ఆటలపోటీలు జరుగుతాయి. అవన్నీ నిర్వహించటమంటే ఇంకొకళ్ళకి సాధ్యమౌతుందనుకున్నావా? పేగులు తెగుతాయి. నేను లేకపోతే ఒక్క నిముషం గడవదక్కడ" అన్నారాయన చిరాగ్గా.

నారాయణి మనసులోనే నిట్టూర్చింది. పైకి ఏమీ అనకుండా లోపలికి వెళ్ళిపోయింది. ఆమె యిక ఆ ప్రసక్తి భర్తవద్ద తీసుకురాలేదు. అనూరాధని కూచోబెట్టుకొని నాలుగు ముక్కలు రాయించింది అన్నగారికి. ఇక్కడ బావగారు క్షణం తీరికలేని పనుల్లో మునిగిపోయారనీ, కాబట్టి శ్రమ అనుకోకుండా తనే వాళ్ళతో మాట్లాడి వాళ్ళని పిల్లను చూడటానికి తీసుకు రావల్సిందని, శ్రద్ధ తీసుకోవలసిందనీ ప్రాధేయ పూర్వకంగా రాయించింది. డబ్బుకూడా పంపించింది. ఇలా రాశానని భర్తతో చెబితే "మంచిపని చేశావు అలా సర్దుకోవాలి" అన్నారాయన.

ఈ వుత్తరం రాసిన ఆరోనాటికల్లా గలగలమంటూ అన్నగారు పెళ్ళివారితో సహా వచ్చి దిగాడు. కలిసితే అతికదంటూ ఆ వచ్చినవారు నేరుగా ఇక్కడికి రాకుండా వాళ్ళ దూరపు చుట్టాలున్నారని వెళ్ళారు. అక్కడ భోజనం చేసుకుని తాంబూలం సేవిస్తూ చక్కా వచ్చారు. క్రితంరోజు తాము వస్తున్నట్టుగా వుత్తరం రాసినా కన్యాదాతగారు ఇంట్లో లేకపోవడం గమనించి ఆశ్చర్యంగా, అనుమానంగా "నా వుత్తరం అందలేదేవిఁటి?" అని అడిగాడు నారాయణి అన్నగారు.

పిల్లకి ముస్తాబు హడావుడిలో మునిగిన నారాయణి "అందింది. లేకపోతే ఈ ఏర్పాట్లన్నీ ఎలా జరిగాయనుకుంటున్నావు" అంది.

"మరయితే బావ ఎక్కడికి వెళ్ళినట్టు?"

"ఆయనకి అర్జంటు పనివుండి వెళ్ళారు"

"అయితే వీళ్ళుండగా ఇంటికి రాడేవిఁటి?"

"పోనీలెద్దూ. నువ్వున్నావుగా. ఆయనకి తీరిక లేదు."

"ఇది మరీ వింతగావుంది చెల్లీ! తీరిక లేకపోవటమంటే అర్థంలేదు. ఒకరికి మాటుకు తీరిక వుండేవిఁటి? రోజు బత్తెంమీద పని చేసుకుంటున్నవాడ్ని రెండు రోజుల జీతం వదులుకుని నేనురాగాలేనిది ఒకపూట తీరిక ఆయనకి లేదన్నమాట. ఎవరన్నావింటే నవ్వుతారు. అసలు బాధ్యత అనేది లేదంటే ఒక్క ముక్కలో పోతుంది. నా దగ్గిర దాపరికం, మొహమాటం లేదుసుమా. వున్నమాట అనేస్తాను," అంటూ చనువుగానే నాలుగూ దులిపాడు ఆయన.

నారాయణి నవ్వుతూ "నీ సంగతి నాకు తెలియదుట్రా. పోనిద్దూ. ఆయనకి మటుకు బాధ్యత లేదనా. ఇవాళ పిల్లకి, చీరా, పళ్ళూ, ఫలాలూ, తమలపాకులూ, వక్కలూ, ఇంకా ఏవిఁటేమిటో తెచ్చారు? ఆఁ! అన్నట్టు కూరలూ ఇవన్నీ తెచ్చి పడేయ్యలేదూ. నిజంగా ఆయనకి తీరికలేదు. చెట్టంత మేనమాఁవవి నువ్వుండగా ఆయనకేంరా?" అంది.

"పురుషుకు పుట్టినన్నాళ్ళకి యజ్ఞం చేశాడని మీ ఆయన ఇన్నాళ్ళకి ఇంటిపనులు కాస్త చేశాడని మహా గొప్పగా చెప్పొస్తున్నావు. ఎవరి తరహా ఎవరికి తెలియదు. అది సరిలే ముందు త్వరగా తెముల్చు. మళ్ళీ వాళ్ళు చీకటిపడగానే వెళ్ళిపోతారు. కాస్త పౌడరూ అదీ బాగా కనబడేటట్టు మందంగా పట్టించు. పెదిములకి 'లిప్‌స్టిక్' తెప్పించక పోయావా..."

"ఫో మావయ్యా! నీదంతా వేళాకోళం" అని సిగ్గుపడి సిగ్గులోని ఆనందం అనుభవించి వొళ్ళు పులకరింపచేసుకుంది అనూరాధ.

నారాయణికూతురు ముస్తాబు పూర్తిచేసి, ముందు హాల్లోనుంచి అన్నగారు "చెల్లీ అమ్మాయిని తీసుకు రామ్మా"అనగానే కూతుర్ని రెక్కపట్టుకుని ముందుకు నడిపించింది. సిగ్గుభారంతో అనూరాధ అడుగు ముందుకు పడలేదు. వెనక నారాయణి తొందర చెయ్యటంతో ఆమె మందంగా అడుగులు వేసుకుంటూనడిచి మధ్యహాలులో వాళ్ళందరికీ కొద్దిదూరంలో తివాచీ మీద తలవంచుకుని కూర్చుంది. అలా కూర్చునే ఆమె మొదటిసారిగా జీవితంలో అతి అవమానకరమైన కొన్ని అనుభవాలని, సత్యాలనీ తెలుసుకుని మానసికంగా కొంత పెద్దదయిపోయింది. ఈ పెళ్ళిచూపుల తతంగం ఆమె వూహించినదానికి కేవలం భిన్నంగా వుండటమే కాదు జీవితంలో ఇంతటి జుగుప్సాకరమైన అనుభవం తనింతవరకూ పొందలేదనికూడా ఆమె అర్థం చేసుకుంది.

ఆ చూడవచ్చినవారిలో ఆడంగులు తనురాగానే తన పక్కకివచ్చి కూర్చుని తలమీద చెయ్యిపెట్టి శల్య పరీక్ష చేసి 'ఈ మచ్చ ఏమిటండీ' అన్న దొకావిడ.

నారాయణి కలగజేసుకుని "చిన్నప్పుడు ఆటల్లో గుమ్మంతగిలి గాయమయింది. అది మచ్చపడింది" అంది.

"అయితే ఎంతవరకూ చదువుకున్నావమ్మా?" అని ప్రశ్నించారు పడకకుర్చీలో కూర్చున్న పెళ్ళి కుమారుని తండ్రి.

అనూరాధ తలవంచుకుని ఏ సమాధానం చెప్ప కుండా వుండటం గమనించి అవతలవాళ్ళు అపోహ పడతారేమోనని నారాయణి "చెప్పు అనూరాధా! వారు ఏదో అడుగుతున్నారు." అంది.

"చెప్పు! చెప్పు! లేకుంటే మూగపిల్ల అను కుంటాం" అంటూ ఆయన తన చమత్కారానికి తనే పెద్దగా నవ్వేశారు.

అనూరాధ "మూడో ఫారం వరకూ చదివాను" అంది.

"అది 'పాస్' అయావా?"

"లేదు"

"బాగుంది, నాకూ ఈ చదువులంటే పరమ అసహ్యం. అయినా వూరికే అడిగాను. ఆడవాళ్ళకి కాస్త వుత్తరంముక్క చదవనూ రాయనూవస్తే చాలు."

"అహ్హే అది పెద్దపెద్ద గ్రంథాలే చదువుతుం దండీ. ఏదమ్మా భాగవతంలోనుంచి వరూధిని ప్రవ రాఖ్యుడు ఘట్టాలలోని పద్యం ఒకటి..."

నారాయణి అన్నగారిమాట పూర్తిగాకుండానే పెళ్ళికుమారుడు తండ్రిగారు: "అబ్బ! పోతన్నగారు మనుచరిత్ర ఎంతగొప్పగా రాశారండీ. నేను ఎన్ని మార్లు చదివానో ఒక లెఖ్ఖా జమాలేదు. అయినా ఈ కాలం వాళ్ళకి మన పూర్వకాలంనాటి కవిత్వం యొక్క గొప్పతనం అర్థంకాదు" అన్నారు.

"అదేమిటండీ మనుచరిత్ర రాసింది తెనాలి రామ కృష్ణుడుకదూ మీరు పోతన్నగారి భాగవతానికీ, మను చరిత్రకీ ముడిపెడతారేమిటి?" అంది ఆయనభార్య తన పాండిత్యం నలుగురూ గమనించారో లేదో నని చుట్టూతా చూస్తూను.

అనూరాధకి నవ్వు ఆగలేదు. ఆమె ముఖం ఎత్తి చూసేసరికి ఎదురుగా తనవైపే గుచ్చిగుచ్చి చూస్తున్న కోరమీసాల అబ్బాయి బొగ్గులబస్తామీద పిడత బోర్లించినట్టుగా వున్న తలకాయని ముందుకుచాచి మీసాలు దువ్వుకుంటున్నాడు.

పెళ్ళికుమారుడు తండ్రి "అవునేవ్. మరచి పోయాను. పొరబడ్డాను. మనుచరిత్ర రాసింది తెనాలి రామకృష్ణుడే. నా కంటె నువ్వే తెలివైనదానివి" అంటూ పెళ్ళాంతో చిన్న సరసం ఆడి తన రసజ్ఞతకి తనే మురిసిపోయారు.

"ఏదమ్మా తెనాలి రామకృష్ణుడి మనుచరిత్ర లోని పద్యాలు రెండు చదువు" అన్నాగాయన.

"మనుచరిత్ర రాసింది అల్లసాని పెద్దన్న. తెనాలి రామకృష్ణుడు కాదు" అని అనూరాధ సమా ధానం ఇవ్వడంతో అక్కడున్నవాళ్ళ ముఖాలన్నీ క్షణం వెలావెలాబోయాయి. వెనక నేకూర్చున్న నారా యిణి మనస్సు సంతృప్తితో కూడిన గర్వంతో నిండి పోయింది.

"ఆఁ! అదే ఒక పద్యం చదువు."

అనూరాధ మాట్లాడదల్చుకోలేదు. నారాయిణి వెనకనించి వీపు తట్టి 'చదువమ్మా ఫర్వాలేదు చదువు" అంది.

అనూరాధ కచ్చితంగా 'నేను చదవను' అనే సింది. ఆడవాళ్ళు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. నారాయిణి కంగారుపడింది. కూతురు స్వభావం గురించి వాళ్లేమనుకుంటారోనని కలతబడింది. మరో మారు "తప్పు! అలా అనకూడదు చదవాలి" అంది.

"నేను చదవనంటే చదవను" అంది అనూరాధ

"పోనీ ఒక పాట పాడమ్మా. సంగీతం వచ్చా"

ఇక గత్యంతరంలేక వెనకనించి తల్లి పోరుపడ లేక అనూరాధ ఒక పాట పాడింది. గాభరాపడి అక్క డక్కడ నట్టినా మొత్తంమీద పాట బాగానే రక్తి కట్టింది. పెళ్లికుమారుడు ఓమారు సర్దుకుని మీసం దువ్వుకొని, వెనకనించి తమ్ముడు 'మీసంమీంచి చెయ్యి తియ్యరా!" అని హెచ్చరించి చేతిమీద ఓ దెబ్బ వేసింతర్వాత సర్దుకుని 'సినిమాపాటలు రావు కాబోలు' అంటూ సణిగి మళ్ళీ అలవాటుగా చెయ్యి మూతిమీదికి పోనిచ్చాడు. మళ్ళీ వెనకనించి తమ్ముడు చేతిమీద చిన్నదెబ్బ వేశాడు.

"ఇంకొకటి పాడమ్మా" అన్నారు పెళ్లికొడుకు తండ్రిగారు. తన గొణుగుడికి తగిన విలువ లేకపోవ టంతో పెళ్లికుమారుడు ముఖం చిన్నబోయింది.

అనూరాధ ఇక పాడనన్నట్టుగా మాట్లాడకుండా కూచుండి పోయింది. వెనకనించి తల్లి మళ్లీ రొక్కిం చింది. అయినా అనూరాధ నోరు విప్పలేదు.

"నీ వయసెంతమ్మాయ్?"

"పదహారు" అని సమాధానం చెప్పింది అనూ రాధ.

"ఇంగ్లీషు చదవటం కూడా వచ్చునా?"

అనూరాధ సమాధానం చెప్పకుండానే నారాయణి అన్నగారు చప్పున లేచి అలమారులోనుంచి ఓ పుస్తకంతీసి అనూరాధ కందించారు. ఆమె పుస్తకాన్ని పేజీఅయినా తిప్పకుండా అలాగే పట్టుకుని వుండిపోయింది.

నారాయణి అతి నిరుత్సాహపడిపోయింది. ఈ పిల్ల బొత్తిగా పెంకి ఘటం అని వాళ్లు ఎక్కడ అనుకుని పోతారో అని ఆమె బాధపడిపోయింది. ఆమె అనూరాధకి బాగా దగ్గరగా జరిగి పక్కగా కూర్చొని చెవి దగ్గర నోరుపెట్టి "అలా కూచుంటే బాగుండదు. చురుగ్గా అడిగిన వాటికి సమాధానం ఇవ్వాలి. వాళ్ళేమనుకుంటారు. ఆ పుస్తకం తీసి నాలుగు పంక్తులు చదువు. వూఁ!" అంటూ ఆమె బుజ్జగించసాగింది.

అయినా అనూరాధ వులక లేదు పలక లేదు.

చివరికి విసుగెత్తి నారాయణి కూడా మౌనం వహించింది.

ఆతర్వాత పెళ్ళికుమారుడు తండ్రి తన పెళ్ళినాటి ముచ్చటల దగ్గర్నుంచీ, ఈనాటి వరకూ ఆయన జీవితంలో ఆయనకి తోచిన అతి ముఖ్య సంఘటనలన్నీ చిలవలూ, పలవలూ పెంచి నారాయణి అన్నగారితో బాతాఖానీలో పడ్డాడు. ఈయన తీరు చూసి నారాయణికి 'పెళ్ళికి పిల్ల నచ్చిందేమో' అనే భ్రాంతిలో పడింది. ఆడవాళ్లుమటుకు ఘురానాగా, బెట్టుగా పలుకైనా లేకుండా ఉండి, ఉండి ముసలాయన ధోరణి చిరాకును వ్యక్తంచేస్తూ, నిరసనగా నిట్టూర్పులు విడుస్తూ వాళ్లు ఎంత తొందరగా కదులుతే అంత మంచిదనే ఆతృతలో వున్నారు.

చివరికి ముసలాయన భార్య కలగజేసుకుని ఆయన వాగ్ధోరణి ఆపుతూ "ఇక లేద్దామా" అనేవరకూ ఆయన తనవునికిని తను తెలుసుకోలేని తన్మయావస్థలో పడిపోయారు.

పెళ్ళివారిని సాగనంపుతూ నారాయణి అన్నగారు, "మళ్లీ మీ దర్శనం ఎప్పుడు?" అన్నారు.

"మేం రెండురోజులు ఈ వూళ్లోనే వుంటాం. మా బంధువులు వున్నారు" అన్నారాయన.

"అయితే మా బావగారు రేపు మిమ్మల్ని కలుసుకొంటారు."

"అలాగే"

ఆడవాళ్ళవద్ద శెలవు తీసుకుంది నారాయణి. వాళ్ళు వెళ్ళగానే నారాయణి ముఖం చించుకుని అనూరాధని చివాట్లు పెట్టింది. తెల్లవారి లేస్తే వాగిన నోరు వాగినట్టుంటుందికదా, అవసరంవస్తే పలుకే బంగారం అయిపోయిందేమే. అంత మొండితనమా? ఒక చెంప నే చెబుతున్నా నా మాటలు లక్ష్యపెడితేనా? ఎంత సిగ్గయితేమటుకు అంత మొండితనమా? అయ్యో! వాళ్ళేమనుకున్నారో? ఈ పిల్ల బొత్తిగా పెంకిదిలాగుందని వాళ్ళు అనుకోరూ?" అంటూ సాధించిపోసింది.

ఆమె అన్నగారు కూడా అనూరాధని కాస్త మందలించాడు. కాని అనూరాధ మనసు అసలే చిరాగ్గావుంది. ఈ ఇద్దరి ధోరణి ఆమెను మరింత వెర్రెత్తించాయి. ఆమె ముఖం కందగడ్డ చేసుకుని "మీరసలు నాతో మాట్లాడకండి. నాకివ్వాళ మహా చిరాగ్గా వుంది" అని అనూరాధ కన్నీరు గ్రుక్కుకుంటూ అక్కడ్నించి వెళ్ళిపోయింది.

అన్నా చెల్లెళ్ళు ఒకళ్ళముఖం ఒకరు చూసుకున్నారు. "పిచ్చిపిల్ల. ఈ మాత్రానికే ఇంత బాధపడాలా? ఇందులో పెద్ద అవమానానికేముంది? లోకంలో జరుగుతున్న పద్ధతేగాని కొత్తదికాదుగా. దీని తీరు చూస్తే నాకు బెంగగావుంది. ఇలాంటి పెళ్ళిచూపులు ఎన్ని జరగాలో ఏమో ఖర్మ! దేవుడు మన పక్షాన వుండి ఈ సంబంధం స్థిరం చేసేస్తే బాగుండును. ఈ ఒక్కసారికే ఇదిలా రభస చేసిందికదా ఇంకోమారంటే అదసలు వచ్చి కూర్చుంటుందా? అబ్బే! ఇలాంటివాళ్ళతో వేగటం మహా కష్టం" అంటూ నారాయణి చాపమీద చతికిలబడి తల మొత్తుకుంది.

"దాని స్వభావానికి మనం అంతగా దిగులుపడాల్సిన అవసరంలేదు చెల్లీ, దానికోసం బెంగపడకు. చిన్నపిల్ల! నాలుగు రోజులుపోతే నీకంటె అనుభవజ్ఞురాలౌతుంది. కాని మనం భయపడాల్సిందల్లా మీ ఆయన స్వభావం గురించే." అన్నారు నారాయణి అన్నగారు.

ఈ చివరి మాటతో నారాయణికి ఎక్కడలేని రోషం పుట్టుకొచ్చింది. ఆమె తలమీంచి చేతులు తీసేసి "నీకు మాట్లాడితే ఆయనొకరు దొరికార్రా లోకువ. ప్రతిదానికి ఆయన వూసు ఎత్తుతూంటావు. ఆయనేదో దయ్యమో, భూతమో అన్నట్టుగా ఆయన స్వభావాన్ని చూసి భయపడాల్సిన అగత్యం ఏముంది? అంటూ నారాయణి తాచుపాములా కస్సుమంది.

ఆవిడ అన్నగారుకూడా అందుకు తగినట్టుగానే "నీ తెలివి మండినట్టేవుంది. కూతుర్ని చూడటానికి పెళ్ళివారొస్తే వాళ్ళని ఆదరించి మాటా మంతీ ఆడటానికైనా ఇంట్లో లేకుండా వుడాయించిన పెద్దమనిషిని నా దగ్గర నువ్వేదో సమర్థించాలనుకుంటావు.

ఆపాటి బాధ్యతకూడా లేని భర్తని చూసుకుని నువ్వు పొంగిపోతున్నావు. ఛా! ఇలాంటి ఆడవాళ్ళంటే నాకు పరమ అసహ్యం! నేను వున్నమాట అనేస్తాను. నాదగ్గర దాపరికం లేదు! రానీ ఆయననుండే అనేస్తాను. కాని ఒక మాట మాత్రం చెప్పదల్చుకున్నాను. ఎవరెలాంటివారైనా నాకు పోయేదేమీ లేదు. కాని నేను బాధపడుతున్నదల్లా నిన్నుగురించీ, నీ పిల్లల గురించీను. నేను వుండి ఇవాళ ఈ పెళ్ళివారిని తీసుకు వచ్చాను. నాకు తీరిక లేక నేను రావటం పడకపోతే ఇక అంతేగా. వేళకి భోజనం చెయ్యటం, వూళ్ళో వ్యవహారాలు, నెత్తిన వేసుకుని తిరగటం, ఇంతేగా మనం చేసే ఘనకార్యాలు. నీ సంసారం తీరు చూసే వాళ్ళకేవీ బాగులేదు చెల్లీ! నేను మళ్ళీ రాత్రి బండికే పోతాను. రేపు వాళ్ళని కలుసుకుని ఏ సంగతీ తెలుసుకోమని బావతో చెప్పు. నేనుండగా వస్తే నేనే చెబుతాను. నేను నీ బాగుకోరేవాణ్నేగాని చెడుకోరేవాణ్ని కాను. అందుకని ఇంతగా చెబుతున్నాను. నెత్తురు సంబంధం వుందికాబట్టి బాధపడతాను. ఎల్లకాలం ఇలా సాగదు. మన జాగ్రత్తలో మనం మన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించుకోకపోతే అధోగతిపాలయిపోతాం. ఎల్లకాలం రోజు లొక్క మాదిరిగా గడవ్వు" అని ఆయన క్షణం ఆగి "ఈ పెళ్ళికి ఏమైనా కాస్త వెనక వేశావా?" అన్నాడు.

"ఏవీ లేదు" అంది నారాయణి తల వంచుకునే.

"నేనలాగే అనుకున్నాలే. అంతగాక మరేముంది? గతిలేక రోజల్లా వళ్ళు విరుచుకుంటే తిండి మెతుకులు దొరక్క నాబోటివాళ్ళు గడ్డి కరుస్తుంటే, వచ్చింది ఖర్చు చేసుకోవటం తెలియక మీబోటివాళ్ళు కష్టాలు కొని తెచ్చుకుంటారు. మీ చేతులారా మీరు మెడకి వుచ్చులు పోసుకుంటున్నారు. డబ్బు విలువ తెలియకుండా దుబారా చేసేవాళ్ళని చూస్తుంటే నా కడుపు మండిపోతుంది. ఆ క్లబ్బులో చేరేవాళ్ళంతా అలాంటివాళ్ళే. కేవలం వ్యసనంకోసం జీవితాన్ని, సర్వస్వాన్ని బలిపెట్టే గాలిపటాలన్నీ అక్కడ చేరుతూంటాయి. మీ ఆయన వారిమధ్య యుగాలు నిముషాలుగా, హుషారుగా సర్వం మరిచి తిరుగుతూంటాడు. నువ్వాయన్ను తలుచుకుని మురిసిపోతూంటావు. ఇదంతా పాతివ్రత్యమని లోలోపల గర్వం పెంచుకుంటావు. ఏదో పెద్ద ఎదురుదెబ్బ తగిలేవరకూ మీలాంటి వాళ్ళు ఇలాగే వుంటారు. ముందు నీ వంతు నీ భర్తని అదుపులో పెట్టటానికి ప్రయత్నించు. సాగకపోతే అది వేరు సంగతి. అందుకు నువ్వు చేసిన ప్రయత్నమంటూ వుండాలిగా. ఇరవై ఏళ్ళనించీ నీ సంసారం నువ్విలా చేసుకున్నావు. ఇప్పుడిక అంతా మించిపోయింది" అంటూ ఆయన కాస్త తీవ్రంగా, సూటిగా ఎక్కడయితే తగలాలో గురిచూసి ప్రతిమాటా తూచి తూచి ప్రయోగించారు.

నారాయణి భర్తనిగురించి ఇంతచులకనగా అన్నగారు మాట్లాడటం సహించలేకపోయింది. "మీరంతా అనుకున్నంత ప్రమాదమేదీ ఆయన స్వభావంలో నాకు కనిపించలేదు. ఆయన నాకు దేముడంత మంచివారుగా కనిపిస్తారు" అని ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

ఆయన భుజాలు కుంచించుకుని మూతివిరుచుకుని "ఎవరి ఖర్మ వారిది. తనకి తోచనన్నా తోచాలి, ఒకరు చెబుతేనన్నా వినాలి. రెండూ లేనివారికి ఎవరుమటుకు చెప్పగలరు" అనుకున్నారు అర్ధస్వగతంగా.

భోజనందగ్గరకూడా అన్నాచెల్లెళ్ళు మౌనంగానే వుండిపోయారు. చివరికి ఆయన మెల్లగా తలవంచుకునే "నా తల్లితండ్రులంతగా లేనివాళ్ళు కావటంవల్ల నాకు విద్యాబుద్ధులు అబ్బే అవకాశంలేక ఇలా శరీరాన్ని అతి చవకగా అమ్ముకుని, ఒక పూట తినీ, ఒకపూట తినకా బ్రతుకుతున్నాను. ఉన్నదానిలో వున్నంతగా నా పిల్లల్ని సుఖపెట్టటానికే ప్రయత్నిస్తాను. కట్టుకున్న తర్వాత, కన్నతర్వాతా వాళ్ళని చూసుకోవద్దూ? బాధ్యత అనేది చాలా విలువైనదమ్మా. అది చిన్ననాటినుంచీ అబ్బాలి. లేకుంటే జీవితం దుఃఖభాజనం అయిపోతుంది" అన్నారు.

నారాయణి అన్నగారి దైన్యానికి కంటనీరు పెట్టుకుంది. ఆ దుఃఖతీవ్రతతో ఆమె కిక ముద్ద లోపలికి వెళ్ళలేదు. మావయ్యమాటలు అనూరాధ మనసునికూడా ద్రవింపచేశాయి. నారాయణి తినే తినే అన్నం విడిచిపెట్టి పెరటిలోకి వెళ్ళిపోయింది. ఆయన తలపట్టుకుని అలాగే గోడకి చారబడిపోయారు.

ఆర్రాత్రి భర్త ఇంటికి రాకుండానే నారాయణి అన్నగారు వెళ్ళిపోయారు. వెళ్ళబోయేముందు పిల్లల భవిష్యత్తు గురించి శ్రద్ధ పటవలసిందని మరీ మరీ హెచ్చరించారు. నారాయణి పదిహేను రూపాయిలు అన్నగారి చేతిలో వుంచబోయింది.

ఆయన ఆవిడ గుప్పిట అలాగే మూసి "నువ్వు పంపిన పాతిక రూపాయిల్లో ఇంకా ఇరవై రూపాయిలు అలాగే వున్నాయి. అవి నాకు చాలు. కాని నెల నెలా ఇలాంటి పదిహేను వెనక వేసి ఒక సంవత్సరం తర్వాత "రెండు వందలు వెనక వేశాను అన్నయ్యా" అని ఒక వుత్తరం వ్రాయి. నీ అన్న సంతోషిస్తాడు. ఆ పని నువ్వు చెయ్యి" అని ఆయన వెళ్ళిపోయాడు.

నారాయణి నిట్టూర్చి లోపలికి వచ్చేసింది.

రాత్రి వీరభద్రంగారు ఇంటికి వచ్చేసరికి పన్నెండు దాటింది. ఆయన వస్తూనే ఎవరినో తిడుతూ

అడుగుపెట్టారు. ఆయన ముఖం చాలా తీవ్రంగా వుంది. 'ఏమిటండీ' అని అడగటానికికూడా నారాయణి సాహసించలేకపోయింది. ఆయనే చెప్పసాగారు: "వాళ్ళని పాతిపెట్టేటంత డబ్బువుంది. ఏంలాభం! బుద్ధి ఘనం లేనప్పుడు వెధవడబ్బు ఎంతవుండిఏం ప్రయోజనం! ఇప్పటికి రెండు సంవత్సరాల చందాలు బాకీ వున్నారు క్లబ్బుకి. ఇవాళ రొక్కం చేసరికి నానా కూతలూ కుయ్యసాగారు. అడుగుతే నామోషీలు. అడక్కుండా కడదామనే బుద్ధిలేనివాళ్ళు అడుగుతే పౌరుషాలు దేనికి? కడితే డబ్బుకట్టండి లేకుంటే సభ్యత్వానికి రాజీనామా ఇవ్వండి. మీరు ఇవ్వకపోతే నేనే రద్దుచేస్తాను" అని చెప్పేసాను. దాంతో వెధవలు జారిపోయి డబ్బుకట్టేశారు. ఈ వీరభద్రం గారితో వ్యవహారం అంటే ఏమిటో వాళ్ళకి తెలిసి చావదు. మళ్ళీ వెధవలు సిగ్గులేకుండా నాదగ్గరికి వచ్చి వాళ్ళంతట వాళ్ళే పలకరించారు. మంచిగావుంటే గౌరవిస్తాను. లేదా నల్లిని నొక్కినట్టు నొక్కిపారే స్తాను" అంటూ ఆయన భార్య అందించిన పంచ తీసుకుని "నాకు కాస్త మజ్జిగా అన్నం కలిపివుంచు. తిని పడుకుంటాను" అన్నారాయన.

నారాయణి మనసు క్షోభపడింది. ఇవాళ అమ్మాయిని చూడటానికి పెళ్ళివారు వస్తున్నారన్న సంగతి ఆయనకి తెలియకపోదు. 'వాళ్ళు వచ్చారా' అనిగాని 'ఏమన్నారు?' అనిగాని—అసలా విషయమే ఆయన ప్రస్తావించకపోవటం నారాయణికి మనసు కష్టం తోచింది. అయినా ఆమె తన స్వభావానికి విరుద్ధంగా ఆయనతో ఘర్షణపడలేదు.

చివరికి భోజనందగ్గర మటుకు ఆయన అప్పటికీ ఆ ప్రసక్తి తీసుకురాకపోవటం గమనించి "ఇవాళ అమ్మాయిని చూట్టానికి వాళ్ళు వచ్చారు. అన్నయ్య కూడా వచ్చాడు" అంది.

"అలాగా" అన్నారాయన.

"చూసి వెళ్ళారు. రేపు ఈ వూళ్ళోనే వుంటారుట. మీరోమారు వెళ్ళి కలుసుకుంటే ఏమాటా వాళ్ళు చెబుతారు. భగవంతుడిదయవల్ల ఈ సంబంధం స్థిర పడితే బాధలేదు" అంది నారాయణి.

ఆయన అయిష్టంగా ముఖం మార్చుకుని "నాకెక్కడ తీరికవుందే. బోలెడన్ని పను లున్నాయి." అన్నారు.

"అలాగంటె ఎలాగు. మనపన్లు మనం చూచుకోవద్దూ?"—ఇన్నాళ్ళకి నారాయణి ఆమాత్రం ఎదురు మాట అనగలిగింది.

ఆయన తల అడ్డంగా తిప్పుతూ "అబ్బే! చాలా ముఖ్యమైన పన్లున్నాయి. అయినా ప్రయత్నిస్తాను" అన్నారు.

నారాయణి ముఖం ఆశతో వెలిగింది.

మర్నాడు, ఆమె ఈ విషయం మరోమారు జ్ఞాపకం చేసింది. అయన విసుక్కున్నారు. "సర్లెద్దూ వందమార్లు చెప్పాలేమిటి?" అంటూను.

"అమ్మా చింతపండు అయిపోయిందే. కాఫీ గిన్నెలు తోమటానికి పనిమనిషి వచ్చింది" అంటూ అనూరాధ వచ్చింది.

నారాయణి అలమారులోనుంచి డబ్బుతీసి లెఖ్ఖ పెట్టి చంద్రుడ్ని పిలిచి వాడికిచ్చి వాడ్ని వెళ్ళి పట్టుకురమ్మంది.

వాడు ఆ డబ్బుపుచ్చుకుని గెంతుకుంటూ వీథిని పడ్డాడు. పది నిముషాలన్నా కాకుండానే ఏడుస్తూ నెత్తిబరుక్కుంటూ వాడు ఇంట్లో ప్రవేశించాడు. నారాయణి కంగారుగా 'ఏమయిందిరా?' అంటూ ఇవతలికి వచ్చింది.

వాడు వెక్కుతూ కళ్ళనులుపుకోసాగాడు.

"ఏమయిందిరా? చింతపండు తెచ్చావా?"

"మరేం......"

"ఆఁ! ఏమయింది త్వరగా చెప్పు."

"మరేం దారిలో డబ్బులు......"

"ఏమయ్యాయి? పారేశావా? ఎవరన్నా లాక్కున్నారా?"

"జారిపోయి పడిపోయాయి. ఎంత వెతికినా కనబడలేదు." అంటూ వాడు ఏడుపు పొడిగించాడు.

నారాయణమ్మ ఓర్పు సన్నగిలి వాడ్ని నెత్తి మీద నాలుగు మొట్టి "ఎక్కడ పారేసావురా. సరిగ్గా వెతికావా? మళ్ళీపోయి చూసి రా" అంటూ వాడ్ని తోసింది.

"అయినా పెద్దోళ్ళు తెచ్చుకోవాలిగాని ఆయన్ని పంపడమేందమ్మా. ఆయనకేం తెలుసుద్ది" అంది పనిమనిషి చీపురు తీసుకుని ప్రవేశిస్తూను.

"ఇంకెవరున్నారు. నేను వీథిని పడాలి." అంది నారాయణి చేతిలో చంద్రుడ్ని కుంజుతూను.

"ఎంత వెతికినా కనబడలేదే" అంటూ వాడు వెళ్ళటానికి మొరాయించాడు.

నారాయణి నెత్తి మొత్తుకుంటూ "నువ్వన్నా వెళ్ళి ఓమారు వెతికిరా అమ్మా! పోరా! దాంతో పోయి వెతికిరా" అంటూ వాడ్ని ఓ తోపు తోసింది.

పని మనిషి వాడ్ని తీసుకుని వీథిలోకి నడిచింది.

[సశేషము]